సోమవారం
01-08-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 41
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

పింఛను పెరిగేనా...?

- రూ.300 నుంచి పెంపు కోసం వృద్ధుల ఎదురుచూపులు
- పదేళ్లుగా నిరీక్షణే...
- జాతీయ పింఛను పథకాలపై నీలినీడలు
- కేంద్ర, రాష్ట్రాల మధ్య పరిష్కార కమిటీ ఏదీ...?

దేశంలో పేద వృద్ధులు తమ పింఛను మొత్తం ఎప్పుడు పెరుగుతుందా అని ఎదురు చూస్తున్నారు. రూ.300గా ఉన్న పింఛను పెంపుదల కోసం 10 ఏళ్లుగా నిరీక్షిస్తున్నారు.

2లో

స్వర్ణ భేరి

- భారత్‌కు మరో బంగారం
- వెయిట్ లిఫ్టింగ్‌లో అందరగొట్టిన జెరెమీ
- రజతం గెలుచుకున్న బింద్యారాణి

బర్మింగ్‌హామ్: కామన్‌వెల్త్ క్రీడల్లో వెయిట్ లిఫ్టర్ జెరెమీ లాల్‌రిన్నుంగా దుమ్మురేపాడు. 67 కేజీల విభాగంలో ఈ 19 ఏళ్ల కుర్రాడు రికార్డు సృష్టిస్తూ బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నాడు. క్లీన్ అండ్ జెర్క్‌లో మొదటి ప్రయత్నంలో 154 కేజీలు ఎత్తిన లిఫ్టర్.. రెండో ప్రయత్నంలో 160 కేజీలు ఎత్తాడు. దీంతో మొత్తంగా 300కేజీలకు పైగా ఎత్తి ఓవరాల్‌గా రికార్డు సృష్టించాడు.

మరో పతకం

కామన్వెల్త్ క్రీడల్లో భారత్ పతకాల ప్రయాణం కొనసాగుతోంది. వెయిట్‌లిఫ్టర్లు అద్భుత ప్రదర్శనతో దూసుకెళుతున్నారు. వెయిట్ లిఫ్టింగ్ 55కిలోల విభాగంలో 23 ఏళ్ల బింద్యారాణి రజతం గెలుచుకుంది. స్నాచ్‌లో 86, క్లీన్ అండ్ జెర్క్‌లో 116.. మొత్తం 202 కేజీల స్కోర్ చేసిన బింద్యారాణి.. భారత్‌కు నాలుగో పతకాన్ని సాధించి పెట్టింది. ఇప్పటికే మహిళల 49 కేజీల విభాగంలో మీరాబాయి చాను స్వర్ణం, పురుషుల 55 కేజీల్లో సంకేత్ రజతం, 61 కేజీల విభాగంలో గురురాజ పూజారి కాంస్యం నెగ్గారు. దీంతో పతకాల పట్టికలో భారత్ టాప్-10లో నిలిచింది. రజత పతకం సాధించిన వెయిట్ లిఫ్టర్ బింద్యారాణి దేవీకి ప్రధాని నరేంద్ర మోదీ ట్విటర్‌లో అభినందనలు తెలిపారు. ప్రధానితోపాటు అనేకమంది ప్రముఖులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

సంకేత్‌కు రూ.30లక్షల రివార్డు

మరోవైపు, వెయిట్ లిఫ్టింగ్ 55 కిలోల విభాగంలో రజత పతకంతో మెరిసిన సంకేత్‌కు మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే నగదు రివార్డు ప్రకటించారు. సంకేత్‌కు రూ.30లక్షలు, ఆయన ట్రైనర్‌కు రూ.7లక్షల చొప్పున రివార్డుగా ఇవ్వనున్నట్టు సీఎంవో ఓ ప్రకటనలో వెల్లడించింది.

సిండి 'కేట్లు'!

- 500 బార్లకు ఈ-వేలం
- కడపలో అత్యధికంగా రూ.1.89 కోట్లు
- వైసీపీ నేతల పోటాపోటీ
- ధరలు పెరగకుండా జాగ్రత్తలు
- పోటీదారులకు తాయిలాలు
- కోట్లలో ప్రభుత్వ ఆదాయానికి గండి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రెండు రోజులపాటు బార్లకు నిర్వహించిన ఈ-వేలంలో వైసీపీ ప్రజాప్రతినిధుల అనుచరులే అధికంగా వాటిని కైవసం చేసుకున్నారు. ప్రకాశం జిల్లా దర్శిలో మద్యంషాపు రూ.1.47 కోట్లు పలికింది. ఇదే జిల్లా అద్దంకిలో రూ.1.37 కోట్లకు పాడారు. మార్కాపురంలో రూ.1.17 కోట్లు, చీమకుర్తిలో రూ.1.7కోట్లకు వేలం పాడారు. ఈనెల 30న ప్రారంభమైన మద్యం ఈ-వేలం టెండర్ల ప్రక్రియ ఆదివారంతో ముగిసింది. రెండో రోజు వైసీపీ ప్రజాప్రతినిధుల బెదిరింపులతో వ్యాపారులు వెనక్కి తగ్గారనే విమర్శలు వినవస్తున్నాయి. ప్రధాన నగరాలు/పట్టణాల్లో వైసీపీ నేతల అనుచరులే బార్లను దక్కించుకున్నారు. మొదటి రోజుతో పోల్చుకుంటే రెండో రోజు ఆదాయం తగ్గింది. బార్ల ఈ-వేలంలో అత్యధిక ప్రాంతాల్లో రాజీ కుదుర్చుకున్నట్లు తెలుస్తోంది. మద్యం వ్యాపారులు సిండికేట్లుగా మారారనే ప్రచారముంది. ఈ-వేలంలో ధర పెరగకుండా వ్యాపారులు జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిసింది. కోస్తాలోని ఆరు జిల్లాల్లో 500 బార్లకు ఈ-వేలం వేయగా, నెల్లూరు, ఒంగోలు, గుంటూరు, విజయవాడ, కాకినాడ, అమలాపురంలో చాలా మంది సిండికేట్‌గా మారినట్లు సమాచారం.

కాకినాడలో పోటీదారులకు రూ.20 లక్షలు

కాకినాడ కార్పొరేషన్ పరిధిలో 11 బార్లకు వేలం వేయగా, కేవలం 11 మంది హాజరయ్యారు. ప్రభుత్వ

- మిగతా 2 లో

దారుణం

అప్పులిచ్చి మింగేస్తున్న లోన్ యాప్‌లు!

- తెలుగు రాష్ట్రాల్లో ఆగడాలు
- నిత్యం చిత్ర హింసలు
- పరువు ప్రతిష్ఠలకు భంగం
- ఆత్మహత్యలకు పాల్పడుతున్న బాధితులు
- చెన్నయ్ కేంద్రంగా దందా

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: తెలుగు రాష్ట్రాల్లో ఆన్‌లైన్ లోన్ యాప్ నిర్వాహకుల ఆగడాలు మితిమీరిపోతున్నాయి. రుణాల పేరిట ప్రజలకు ఎర వేసి దారుణాలకు ఒడిగడుతున్నారు. 'మీరు రుణం వడ్డీతో సహా తీర్చండి... లేకుంటే మీ పిల్లల్ని చంపుతాం...మీ బంధువులకు మీ ఫోటోలు పంపి వేధింపులకు పాల్పడతాం... అంటూ రికవరీ ఏజెంట్లు బరి తెగించి బెదిరింపులకు పాల్పడుతున్న సంఘటనలు వెలుగు చూస్తున్నాయి. చాలా మంది ఈ యాప్‌ల బారిన పడి ఆర్థికంగా చితికిపోగా, మరికొందరు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. రుణం తీరకముందే బెదిరింపులు రావడంతో బాధితులకు దిక్కుతోచడం లేదు. మొదట తీయగా రుణ ఆసక్తిదారులను ఫోన్ల ద్వారా మాటల్లోకి లాగి, ఆ తర్వాత లోన్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేయిస్తుంటారు. సునాయాసంగా, ఎలాంటి కాగితాలు, హామీలు లేకుండా, బ్యాంక్ క్రెడిట్ స్కోర్ అవసరం లేకుండా, తక్కువ వడ్డీతో క్షణంలో రుణం మంజూరవుతుందంటూ నమ్మిస్తారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ప్రజలు వారి మాయమాటలకు పడి, తుదకు అసలు కంటే, వడ్డీ తీర్చలేక నానా ఇబ్బందులకు గురవుతున్నారు. లోన్‌యాప్‌లను పేద, మధ్యతరగతి వర్గాలు

- మిగతా 2 లో

నేటి నుంచి సినిమా షూటింగ్‌ల నిలిపివేత

హైదరాబాద్: చిత్ర పరిశ్రమలో నెలకొన్న సమస్యల నేపథ్యంలో ఆగస్టు 1వ తేదీ నుంచి చిత్రీకరణలు నిలిపివేయాలని ఫిలిం ఛాంబర్ జనరల్ బాడీ సమావేశంలో నిర్ణయించారు. గిల్డ్ నిర్ణయానికి ఫిలిం ఛాంబర్ మద్దతు తెలిపింది. సినిమా చిత్రీకరణలను కొన్ని రోజులు ఆపాలని నిర్ణయించినట్లు తెలుగు ఫిలిం ఛాంబర్ అధ్యక్షుడు బసిరెడ్డి తెలిపారు. అందరం కూర్చొని మాట్లాడుకుంటామని, పరిష్కారం దొరికే వరకూ షూటింగ్‌లను తిరిగి మొదలు పెట్టబోమని నిర్మాత దిల్ రాజు ఈ సందర్భంగా తెలిపారు. కొత్త సినిమాలే కాదు, చివరి దశలో ఉన్న చిత్రాల షూటింగ్‌లు కూడా నిలిపివేయాలని నిర్ణయించారు. తాజా నిర్ణయం అందరినీ ఆశ్చర్యపరిచింది. ప్రస్తుతం ఇండస్ట్రీలో నెలకొన్న పరిస్థితుల వల్ల నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లు ఎవరూ సంతోషంగా లేరని ఫిలిం ఛాంబర్ ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. సమస్యల పరిష్కారం కోసం

- మిగతా 2 లో

'ఆపరేషన్ కమలం'

- జార్ఖండ్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు కుట్ర
- ముగ్గురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు డబ్బు, పదవి ఎర
- హౌరాలో నగదుతో దొరికిపోయిన ప్రజాప్రతినిధులు
- పోలీసు విచారణ తర్వాత ఎమ్మెల్యేల అరెస్ట్
- ప్రతి ఎమ్మెల్యేకు రూ.10 కోట్లు, మంత్రి పదవి : కాంగ్రెస్
- ఇది ఢిల్లీలో 'హమ్ దో' గేమ్ ప్లాన్ అని ఆరోపణ

న్యూఢిల్లీ/రాంచి/హౌరా: దేశంలో బీజేపీ యేతర ప్రభుత్వాలను కూలగొట్టే కుట్రలను కాషాయ పార్టీ కొనసాగిస్తోంది. ఆయా పార్టీల ఎమ్మెల్యేలకు నగదు, పదవులను ఎర వేస్తూ ప్రజాస్వామ్య హననానికి ఒడిగడుతోంది. తాజాగా జార్ఖండ్‌లోని హేమంత్ సోరెన్ ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు 'ఆపరేషన్ కమలం' బట్టబయలైంది. పశ్చిమ బెంగాల్‌లో జార్ఖండ్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ముగ్గురి ఎమ్మెల్యేల వద్ద భారీగా నగదు దొరకడంతో బీజేపీ 'అనైతిక' చర్య మరోసారి వెలుగుచూసింది. తమ ముగ్గురి ఎమ్మెల్యేకు రూ.10 కోట్ల నగదు, మంత్రి పదవిని ఎర వేసినట్లు కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. ఆ ఎమ్మెల్యేలను పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. బీజేపీ కుట్రపూరిత రాజకీయాలను దుయ్యబట్టింది. పశ్చిమ బెంగాల్‌లోని హౌరా జిల్లాలో ఒక వాహనం నుంచి భారీ మొత్తంలో నగదు స్వాధీనం చేసుకున్న తర్వాత జార్ఖండ్‌కు చెందిన ముగ్గురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ఆదివారం అరెస్టు చేసినట్లు పోలీసు ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. శనివారం సాయంత్రం పంచలా పోలీస్ స్టేషన్ పరిధిలోని రాణిహతి వద్ద జాతీయ రహదారి-16పై అడ్డగించిన వారి ఎస్‌యూవీ

- మిగతా 2 లో

ఈడీ అదుపులో సంజయ్ రౌత్

8లో

ఇదీ లోకం!

అబ్బే మంత్రిగారు 'ఆన్'లో లేరయ్యా బాబూ!

మద్యాంధ్రప్రదేశ్ జగన్ ధ్యేయం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్‌ను మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చడమే ముఖ్యమంత్రి జగన్ ధ్యేయంలా ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. తాను అధికారంలోకి వస్తే దశలవారీగా మద్య నిషేధాన్ని అమలు చేస్తానని హామీ ఇచ్చిన జగన్, ఇవాళ మాట తప్పి, మడమ తిప్పారన్నారు. రాష్ట్రంలో తన సొంత మద్యం బ్రాండ్లను మాత్రమే అమ్మకానికి పెట్టి కోట్లాది రూపాయల ఆదాయాన్ని ఆర్జిస్తున్నారన్నారు. జగన్ అధికారం చేపట్టిన గత మూడేళ్లల్లో రాష్ట్రాభివృద్ధిని పక్కనపెట్టి, మద్యం మీద ఆదాయం కోసం అర్రులు చాస్తున్నారని విమర్శించారు. ఏడాదికి రూ.9 వేల కోట్లుగా ఉండే రాష్ట్ర మద్యం ఆదాయాన్ని రూ.36 వేల కోట్లకు పెంచారని వివరించారు. ఈ ఏడాది బార్ల లైసెన్సుల టెండర్లు దక్కించుకునేందుకు వైసీపీ నేతలే పోటీ పడ్డారన్నారు. కడప జిల్లాలో వైసీపీ నేతలే రాష్ట్రంలోనే అత్యధిక రేటును చెల్లించి లైసెన్సులు పొందారన్నారు. అధికార పార్టీకి చెందిన మంత్రులు, ఎమ్మెల్యేల భాగస్వామ్యం, అండదండలు బార్ల లైసెన్స్‌దారులకు ఉండటం విచారకరమని, ఇదేనా సంపూర్ణ మద్య నిషేధం దిశగా అడుగులు వేయడం? అని ప్రశ్నించారు. జగన్ రాష్ట్ర ప్రజలను మోసగిస్తున్నారనడానికి వైసీపీ నేతలు పోటీపడి దక్కించుకున్న బార్ల లైసెన్స్‌లే నిదర్శనమన్నారు. జగన్ తిరోగమన విధానాలను రాష్ట్ర ప్రజలు గ్రహిస్తున్నారనీ, మద్య నిషేధంపై జగన్ సర్కార్ ఇదే విధానం కొనసాగిస్తే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని ఆ ప్రకటనలో రామకృష్ణ హెచ్చరించారు.

600 మంది విద్యార్థులు ఒక్కరే మాస్టారు

- మౌలిక వసతుల లేమి
- తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థినులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- అరకులోయ డిగ్రీ మహిళా కళాశాల దుస్థితి

2లో

శిథిలావస్థకు చేరిన తరగతి గదులు, కూర్చునేందుకు బెంచీలు కరువు, ప్రహరీ లేని కళాశాల... ఇక వర్షం వస్తే చెప్పనే అక్కర్లేదు... ఇలా మౌలిక వసతుల లేమితో అరకులోయ డిగ్రీ కాలేజీ విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇవన్నీ అధిగమించి కనీసం పాఠాలు నేర్చుకుందామన్నా, అన్ని సబ్జెక్టులకు కలిపి ఒకే అధ్యాపకుడు కావడంతో వారి పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. 'మా పరిస్థితి ఇది సారూ...' అని మొరపెట్టుకుంటున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పెడచెవిన పెడుతున్నారు. దీంతో దిక్కుతోచని పరిస్థితుల్లో వారు కొట్టుమిట్టాడుతున్నారు. మొత్తంగా 40 మంది సిబ్బంది ఉండాల్సిన చోట కేవలం ఇద్దరు మాత్రమే పనిచేస్తున్నారు.

మా దేశానికి రావద్దు

32 మంది న్యూజిలాండ్ అధికారులు, జర్నలిస్టులపై రష్యా నిషేధం

మాస్కో : న్యూజిలాండ్ అధికారులు, జర్నలిస్టులు మొత్తం 32 మందిని తమ దేశంలో ప్రవేశాన్ని నిరాకరిస్తూ రష్యా శనివారం ఆదేశాలిచ్చింది. రష్యా పౌరులపై న్యూజిలాండ్ ఆంక్షలు పెరుగుతుండటానికి ప్రతిస్పందనగా తాజా చర్యలకు పూనుకున్నట్లు రష్యా విదేశాంగ శాఖ ప్రకటన తెలిపింది. ఉక్రెయిన్‌తో యుద్ధం క్రమంలో మాస్కోకు వ్యతిరేకంగా వెల్లింగ్టన్ చర్యలు తీసుకుంటోందని పేర్కొంది. నిషేధించిన వారిలో వెల్లింగ్టన్ మేయర్ ఆండ్రూ ఫోస్టర్, ఆక్‌లాండ్ మేయర్ ఫిలిప్ గాఫ్, న్యూజిలాండ్ నేవీ కమాండర్ గారిన్ గోల్డింగ్‌లతో పాటు జర్నలిస్టులు కేట్ గ్రీన్, జోసే పగానీ ఉన్నట్లు రష్యా ప్రకటన వెల్లడించింది. న్యూజిలాండ్ ప్రధాని జసిండా ఆర్డెన్‌పై నిషేధాన్ని ఏప్రిల్‌లో రష్యా విధించిన విషయం విదితమే.

దక్షిణాఫ్రికాలో అమానుషం

- ఎనిమిది మంది మోడల్స్‌పై సామూహిక అత్యాచారం
- మ్యూజిక్ వీడియో షూట్ సమయంలో లైంగిక దాడి
- దోషులను తక్షణమే అరెస్టు చేయాలి : అధ్యక్షుడి ఆదేశం

జోహన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికాలో అమానుషం చోటుచేసుకుంది. జోహన్నెస్‌బర్గ్ సమీపంలో మ్యూజిక్ వీడియో షూటింగ్ క్రమంలో ఎనిమిది మంది మోడల్స్‌పై సామూహిక అత్యాచారం జరిగింది. జోహన్నెస్‌బర్గ్‌కు పశ్చిమాన ఉన్న చిన్న పట్టణమైన క్రుగర్స్‌డోర్ప్ శివార్లలో గురువారం జరిగిన దాడిపై ఇప్పటివరకు 20 మంది అనుమానితుల్లో ముగ్గురిని భద్రతా బలగాలు అరెస్టు చేసినట్లు పోలీసు అధికారి భేకీ సెలే ఆదివారం తెలిపారు. షూటింగ్ కోసం సెట్‌ను సిద్ధం చేసే సమయంలో మోడల్స్‌పై లైంగిక దాడి జరిగింది. బాధితులు 18-35మధ్య వయస్సుగల వారు. వీరిలో ఒకరిపై ఏకంగా పది మంది అత్యాచారానికి పాల్పడగా మరొకరిపై ఎనిమిది మంది దాడి చేశారని సెలే వెల్లడించారు. పురుషులను సైతం వివస్త్రలను చేసి నిలువునా దోచుకున్నారన్నారు. దక్షిణాఫ్రికాలో ప్రతి 12 నిమిషాలకు సగటున ఒక మహిళపై అత్యాచారం జరుగుతుందని పోలీసు నివేదికలు చెబుతున్నాయి. తాజా ఘటనపై అధ్యక్షుడు సిరిల్‌రామాపోసా స్పందించారు. దోషులను వీలైనంత త్వరగా పట్టుకోవాలని అధికారులకు ఆదేశాలిచ్చారు.

బంగ్లాదేశ్‌లో ఘోర ప్రమాదం

- మినీ బస్సును ఢీకొట్టిన రైలు - 11 మంది దుర్మరణం
- మృతుల్లో నలుగురు టీచర్లు, ఆరుగురు విద్యార్థులు

చిట్టగాంగ్ : బంగ్లాదేశ్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. అతివేగంతో వెళుతున్న ఒక రైలు.. క్రాసింగ్ వద్ద పట్టాలు దాటుతున్న పాఠశాలకు చెందిన మినీ బస్సును ఢీకొట్టింది. దీంతో 11 మంది అక్కడికక్కడే మరణించారు. మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. చిట్టగాంగ్‌లోని మిర్సారాయ్-బారాటకియా రైల్వేస్టేషన్ సమీపంలో ఈ దుర్ఘటన చోటుచేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. రైల్వే క్రాసింగ్ వద్ద కాపలా లేకపోవడమే ప్రమాదానికి కారణమని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. మహానగర్-ప్రోవతి ఎక్స్‌ప్రెస్ రైలు ఈ మినీబస్సును దాదాపు 500 మీటర్లు ఈడ్చుకొని వెళ్లిందని, ప్రమాదం జరిగినప్పుడు అందులో 17 మంది ఉన్నారని పోలీసులు తెలిపారు. క్షతగాత్రుల్లో కొందరి పరిస్థితి విషమంగా ఉందని చెప్పారు. మృతుల్లో నలుగురు టీచర్లు, ఆరుగురు విద్యార్థులు, డ్రైవర్ ఉన్నట్లు వెల్లడించారు. వీరంతా ఖోయచోరా వాటర్ ఫాల్స్‌కి వెళ్లి వస్తుండగా ఈ ప్రమాదం జరిగిందని తెలిపారు. రైల్వే క్రాసింగ్ గేట్‌మెన్ సద్దాం హుస్సేన్‌పై కేసు నమోదు చేసి అతనిని అదుపులోకి తీసుకున్నామన్నారు. కాగా, బంగ్లాదేశ్‌లో వివిధ లెవల్ క్రాసింగ్‌ల వద్ద జరిగిన 4,914 రైలు ప్రమాదాల్లో 400 మందికి పైగా మరణించారని, రెండు వేల మందికి పైగా గాయపడ్డారని రైల్వే డేటా చెబుతోంది.

దారుణం

(మొదటిపేజీ తరువాయి)

ఆన్‌లైన్ ద్వారా ఆశ్రయించి, చిన్న మొత్తంలో రుణాలు తీసుకుంటున్నారు. యాప్ ఇన్‌స్టాల్ చేసుకునే సమయంలో వారి పూర్తి సమాచారంతోపాటు బంధువుల పేర్లు, ఫోన్ నంబర్లు ఆన్‌లైన్లో పొందుపరుస్తారు. ఆ తర్వాత రుణం చెల్లించకుంటే, అందులో సమాచారమున్న వారందరి ఫోన్లకు బెదిరింపులు వెళ్తాయి. ఆ రుణం మీరే చెల్లించాలంటూ ఒత్తిడి చేస్తారు.

అసలుకు నాలుగు రెట్లు వసూలు

లోన్ యాప్‌లో బాధితుడు తీసుకున్న అసలు కంటే, నాలుగు రెట్లు వేసి వసూలు చేస్తున్నారు. అది కట్టే స్థోమత లేక, రుణ గ్రస్తులు నిత్యం వడ్డీలు చెల్లిస్తున్నారు. ఇటీవల వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి వ్యక్తిగత సహాయకుడు తీసుకున్న రుణం కోసం నిర్వాహకుల నుంచి బెదిరింపు ఫోన్లు రావడం చర్చనీయాంశంగా మారింది. రుణం పొందే సమయంలో మంత్రి నంబరు కూడా ఇచ్చారు. దీంతో ఏకంగా ఆయన నంబరుకు 72సార్లు ఫోన్లు చేశారు. మంత్రి ఆదేశాల మేరకు వ్యక్తిగత సహాయకుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా, ప్రత్యేక పోలీసు బృందం రంగంలోకి దిగి, లోన్ యాప్‌ల మూలాలను గుర్తించారు. చెన్నయ్ కేంద్రం నుంచి ఆన్‌లైన్లో లోన్‌యాప్ బృందం ఆగడాల సాగిస్తున్నట్లు సమాచారం. నెల్లూరు జిల్లాకు చెందిన ఏజెంట్లతోపాటు చెన్నయ్‌లోని మేనేజరును అదుపులోకి తీసుకున్నారు. ఇదే తరహా హైదరాబాద్, బెంగుళూరు, ముంబై తదితర మహానగరాల నుంచి లోన్‌యాప్‌ల కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయి.

ఇండియన్ బుల్స్, రూపెక్స్ కంపెనీల ఆగడాలు

ఇండియన్ బుల్స్, రూపెక్స్ యాప్స్ నుంచి గతంలో గుంటూరు జిల్లా చినకాకానికి చెందిన ప్రత్యూష అనే యువతి రూ.20వేల రుణం తీసుకుంటే, ఆమె ద్వారా రూ.2 లక్షలు రీపేమెంట్ తీసుకున్నారు. ఆ తర్వాత రుణం ఉందంటూ వాట్సాప్‌కు అసభ్యకరమైన మెస్సేజ్‌లు పంపుతున్నారు. దీంతో మనస్తాపంతో ఆమె ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఆత్మహత్యకు పాల్పడే ముందు తమ తల్లిదండ్రులు, భర్తకు సెల్ఫీ వీడియో పంపింది. ఆమె భర్త పోలీసులకు ఫిర్యాదు చేశారు. హైదరాబాద్ జియాగూడలో రాజ్‌కుమార్ అనే వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డారు. లోన్‌యాప్ ద్వారా రూ.12వేల అప్పు తీసుకుని, ఆ సమయంలో తన మిత్రుల ఫోన్ నంబర్లు ఆన్‌లైన్లో నమోదు చేశారు. ఇంకా రూ.4వేలు చెల్లించలేదంటూ రాజ్‌కుమార్ మిత్రులకు లోన్ యాప్ ఏజెంట్లు ఒత్తిడి చేయడంతో, తీవ్ర మనస్తాపానికి రాజ్‌కుమార్ గురై, ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఇలా ఎంతో మంది లోన్‌యాప్ బారిన పడి దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. బాధితుల ఫోటోలు మార్ఫింగ్ చేసి, వాటిని అసభ్యకరమైన చిత్రాలతో జోడించి సోషల్ మీడియాలో పెడతామని బెదిరింపులకు పాల్పడుతున్నారు. లోన్‌యాప్ నిర్వాహకుల ఆగడాలు మితిమీరుతున్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాటిని నియంత్రించడం లేదు. ప్రత్యేక సైబర్ బృందాలను ఏర్పాటు చేసి, లోన్‌యాప్‌ల ఆగడాలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

లోన్ యాప్‌లపై ప్రత్యేక నిఘా: డీజీపీ

లోన్‌యాప్‌లపై ప్రత్యేక నిఘా ఉంచామని, నిర్వాహకులు వేధింపులకు పాల్పడితే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని డీజీపీ రాజేంద్రనాథ్ చెప్పారు.యాప్‌ల ద్వారా లోన్ తీసుకుని, తిరిగి కట్టలేక చాలా మంది ఆత్మహత్యలకు పాల్పడుతుండడం బాధాకరమన్నారు. చాలా ఫోన్ కాల్స్ ప్రైవేట్ నెంబర్ల నుంచి వస్తున్నాయని, సైబర్ నేరాలపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు. ఆధార్ డేటా, ఫింగర్ ప్రింట్లు ఎవరికి ఇవ్వవద్దని సూచించారు. లోన్‌యాప్‌ల డేటాను సేకరిస్తున్నామని, లోన్ వసూళ్లలో బయటి వ్యక్తుల ప్రమేయం ఉంటే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

నేటి నుంచి సినిమా షూటింగ్‌ల నిలిపివేత

(మొదటిపేజీ తరువాయి)

కృషి చేసి, చిత్ర పరిశ్రమను తిరిగి గాడిలో పెట్టేందుకు ఏం చేయాలన్నది త్వరలో చర్చిస్తామని ఫిలిం ఛాంబర్ తెలిపింది. ఈ క్రమంలోనే 24 విభాగాల వారితోనూ చర్చలు జరుపుతామని పేర్కొంది. అయితే, ప్రస్తుతం హైదరాబాద్‌లో షూటింగ్ జరుపుకొంటున్న ఇతర భాషా చిత్రాలకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. ఫిల్మ్ ఛాంబర్‌లో 48 మంది సభ్యులతో సర్వసభ్య సమావేశం నిర్వహించిన నిర్మాతల మండలి, సభ్యుల సంపూర్ణ మద్దతుతో సినిమా షూటింగ్స్ నిలిపివేస్తున్నట్లు స్పష్టం చేసింది. థియేటర్లకు ప్రేక్షకులు రాకపోవడం, ఓటీటీలో కొత్త సినిమాలు, నిర్మాణ వ్యయాలు, నిర్మాతలు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్న క్రమంలో వాటిని సరిదిద్దేందుకు దృష్టిసారించిన నిర్మాతలు... సినిమాల చిత్రీకరణలు నిలిపివేసి సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కరించుకోవాలని నిర్ణయం తీసుకున్నారు. సోమవారం నుంచి రెగ్యులర్ షూటింగ్స్‌తో పాటు కొత్త సినిమా లేవీ సెట్స్ పైకి వెళ్లవు. దీంతో చిరంజీవి, పవన్ కల్యాణ్, ప్రభాస్, విజయ్ దేవరకొండ లాంటి అగ్రహీరోల సినిమాల చిత్రీకరణ నిలిచిపోనుంది. సమస్యలు పరిష్కారమయ్యే వరకు షూటింగ్స్ బంద్ కొనసాగుతుందని దిల్ రాజు తెలిపారు. అలాగే అధ్యక్షుడిగా ఉన్న కొల్లి రామకృష్ణ పదవీకాలం ముగియడంతో ఈ సమావేశంలో సభ్యులు ఫిల్మ్ ఛాంబర్ నూతన అధ్యక్షుడిగా కొత్తా బసిరెడ్డిని ఎన్నుకున్నారు.

600 మంది విద్యార్థులు

ఒక్కరే మాస్టారు

విశాలాంధ్ర-అరకులోయ రూరల్: అరకులోయ డిగ్రీ కళాశాల పరిస్థితి దయనీయంగా ఉంది. 600 మంది విద్యార్థినులు ఉన్న ఈ కళాశాలలో ఒక ప్రిన్సిపాల్, ఒక లెక్చరర్ మాత్రమే ఉన్నారు. అరకువేలి మండలం, పెద్దలబుడు పంచాయతీలో గల గిరిజన మహిళా డిగ్రీ కళాశా లలో జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్, లెక్చరర్స్, ల్యాబ్ అసిస్టెంట్‌తో పాటు ఉద్యోగులు మొత్తం 40 మంది ఉండాలి. తరగతి గదుల్లో కనీసం కూర్చోవడానికి బెంచీలు లేవు. వర్షం పడితే తరగతి గదులు కారిపోయి శిథిలావస్థకు చేరుకున్నాయి. కళాశాలలో కనీస సదుపాయాలు, బాత్‌రూమ్‌లు, ప్రహరీ లేదని, ఇవే కాక మరెన్నో సమస్యలతో సతమతమవుతున్నట్టు విద్యార్థినులు వాపోతున్నారు. అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు ఇవ్వడమే తప్ప ఎలాంటి ప్రయోజన లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తక్షణ చర్యలు తీసుకోవాలి: ఏపీపీసీసీ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి

కళాశాలను సందర్శించిన ఏపీపీసీసీ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి అక్కడ పరిస్థితులను చూసి విస్మయం వ్యక్తం చేశారు. తక్షణ చర్యలు తీసుకోకుంటే ఉద్యమబాట పట్టాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఆమె వెంట అరకువేలి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బోయి మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శి శెట్టి భగత్ రాం, కాంగ్రెస్ పార్టీ నాయకులు గుంజీడి సుబ్బారావు, కోర్ర పోతురాజు, జంపరంగి వెంకట బాబు, మాదల పండు ఉన్నారు.

పాక్‌లో తొలి హిందూ మహిళా డీఎస్పీ మనీషా రోపేటా

ఇస్లామాబాద్ : పాకిస్తాన్‌లోని సింధ్ ప్రావిన్స్‌లోని జాకోబాబాద్‌కు చెందిన మధ్యతరగతి కుటుంబానికి చెందిన మనీషా రోపేటా (26) ఆ దేశంలోనే తొలి హిందూ మహిళా డీఎస్పీగా నిలిచారు. పాకిస్తాన్‌లో పురుషాధిక్య సమాజం ఉంది. ఈ క్రమంలో ఒక మైనారిటీ వర్గానికి చెందిన మహిళా పోలీసు ఉద్యోగాన్ని పొందడమే కాకుండా అధికారి స్థాయికి చేరుకోవడం చరిత్రాత్మక పరిణామం. 'నేను, నా సోదరీమణులు పితృస్వామ్య వ్యవస్థలో పెరిగాం. విద్యను పొందాం.. ఉద్యోగాలు చేస్తున్నాం. విద్య పొంది ఉద్యోగాలు చేయాలంటే ఏ టీచరో డాక్టరో కావాలి తప్ప మిగతా వృత్తుల్లో బాలికలను ప్రోత్సహించే పరిస్థితి స్థానికంగా లేదు' అని మనీషా తెలిపారు. సామాజిక కట్టుబాట్లను కాదంటూ పోలీసు అధికారి అయ్యానని, మహిళలపై నేరాలు ఎక్కువ కాబట్టి సమాజంలో 'రక్షక్' మహిళల ఆవశ్యత ఉందన్న దృష్ట్యా ఈ వృత్తిని ఎంచుకున్నానని ఆమె తెలిపారు. ప్రస్తుతం శిక్షణ పొందుతున్న మనీషా త్వరలోనే నేరాలు అత్యధికంగా జరిగే లియారీ ప్రాంతంలో పోస్టింగ్ పొందనున్నారు. సీనియర్ పోలీసు అధికారిగా పనిచేయడం మహిళా సాధికారతకు నిదర్శనమని, ఇది ఆత్మస్థైర్యాన్ని నింపుతుందని అన్నారు. తన ముగ్గురు సోదరీమణులు డాక్టర్లు కాగా తమ్ముడు వైద్య విద్యను అభ్యసిస్తున్నారని, తను ఎంబీబీఎస్ ప్రవేశ పరీక్షలో ఒక్క మార్కుతో ఫెయిల్ అయ్యాయని మనీషా తెలిపారు. ఫిజికల్ థెరపీ పట్టా పొందినట్లు చెప్పారు. సింధ్ పబ్లిక్ సర్వీసెస్ కమిషన్ పరీక్షలు రాయగా 468 మందిలో 16వ స్థానంలో నిలిచానని అన్నారు. మనీషా తండ్రి జాకోబాబాద్‌లో వ్యాపారి కాగా ఆయన మనీషాకు 13ఏళ్లప్పుడు చనిపోయారు. దీంతో వీరి కుటుంబం కరాచీకి తరలిపోయింది. సీనియర్ పోలీసు అధికారిణిగా లియారీలో విధులు నిర్వర్తించడం ఆషామాషీ వ్యవహారం కాదని, తన ఆలోచనలు, కష్టపడే తత్వానికిగాను తోటివారు గౌరవిస్తారని మనీషా తెలిపారు. తన స్వస్థలంలో మహిళలు ఇలాంటి వృత్తిలోకి రావడం దాదాపు అసాధ్యమని, తాను పోలీసు అయినట్లు తెలిసి ఎంతో కాలం కొనసాగలేదని అక్కడి వారు వ్యాఖ్యానించారని, వారందరి ఆలోచన తప్పు అని నిరూపించానని మనీషా చెప్పారు. నిబద్ధతతో పనిచేస్తానని, వృత్తికి న్యాయం చేస్తానని దీమా వ్యక్తంచేశారు.

'ఆపరేషన్ కమలం'

(మొదటిపేజీ తరువాయి)

నుంచి రూ.49 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నామని అన్నారు. ఎమ్మెల్యేలు ఇర్ఫాన్ అన్సారీ, రాజేష్ కచ్చప్, నమన్ బిక్సల్ కొంగరి, వారి డ్రైవర్‌తో సహా మరో ఇద్దరిని అరెస్టు చేశారు. వారు ఇంత పెద్ద మొత్తంలో నగదును ఎందుకు తీసుకువెళుతున్నారో పోలీసులకు సమాధానం ఇవ్వలేదు. 'అంత పెద్ద మొత్తంలో నగదును తీసుకెళ్లడానికి గల కారణాన్ని వారు చెప్పలేకపోయారు. గిరిజన మహిళలకు పంపిణీ చేసేందుకు ఉద్దేశించిన చీరలను కొనుగోలు చేసేందుకు ఇక్కడికి వచ్చామన్న వారి వాదనతో మాకు సంతృప్తి లేదు.

తదుపరి విచారణ కోసం మేము వారిని అరెస్టు చేశాము' అని ఆ అధికారి పీటీఐకి తెలిపారు. హౌరా రూరల్ పోలీసుల నుంచి రాష్ట్ర సీఐడీ విచారణ చేపట్టిందని అన్నారు. ఎమ్మెల్యేలతో సహా ఐదుగురిపై నేరపూరిత కుట్ర, అవినీతి నిరోధక చట్టం సహా భారత నేర శిక్షాస్మృతి (ఐపీసీ)లోని సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు ఆయన చెప్పారు.

రాత్రంతా ఎమ్మెల్యేలను విచారించిన తర్వాత అరెస్టులు చేశామని అన్నారు. హౌరా పోలీస్ సూపరింటెండెంట్ (రూరల్) స్వాతి భంగాలియా మాట్లాడుతూ 'నల్ల కారులో భారీ మొత్తంలో డబ్బు రవాణా అవుతున్నట్లు మాకు నిర్దిష్ట సమాచారం అందడంతో వాహనాలను తనిఖీ చేయడం ప్రారంభించాము.

ముగ్గురు జార్ఖండ్ ఎమ్మెల్యేలు ప్రయాణిస్తున్న ఈ ఎస్‌యూవీని అడ్డగించాము. వాహనంలో నగదు దొరికింది' అని తెలిపారు. మొత్తం సొమ్మును నిర్ధారించేందుకు నగదు లెక్కింపు యంత్రాలను తెప్పిస్తున్నామని, ఆ డబ్బు ఎక్కడికి తీసుకువెళుతున్నారని ఎమ్మెల్యేలను కూడా ఆరా తీస్తున్నారు. కాగా ఎస్‌యూవీలో ఎమ్మెల్యేలతో పాటు మరో ఇద్దరు కూడా ఉన్నారని, అందులో కాంగ్రెస్ ఎన్నికల గుర్తుతో పాటు 'ఎమ్మెల్యే జమ్తారా జార్ఖండ్' అనే బోర్డు ఉందని పోలీసులు తెలిపారు. అన్సారీ జమ్తారా ఎమ్మెల్యేగా, కచ్చప్ రాంచీ జిల్లాలోని ఖిజ్రీ శాసనసభ్యుడిగా, కొంగరి సిమ్డేగా జిల్లాలో కోలేబిరా ఎమ్మెల్యేగా ఉన్నారు.

ఎమ్మెల్యేలపై కాంగ్రెస్ ఫిర్యాదు

జార్ఖండ్‌లో జేఎంఎం నేతృత్వంలోని ప్రభుత్వాన్ని కూల్చివేసేందుకు బీజేపీ ఒక్కో ఎమ్మెల్యేకు రూ.10 కోట్లు ఇస్తోందని ఆరోపిస్తూ, పశ్చిమ బెంగాల్‌లోని హౌరాలో భారీ మొత్తంలో నగదుతో అరెస్టయిన తమ ముగ్గురు ఎమ్మెల్యేలపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు కాంగ్రెస్ ఆదివారం తెలిపింది. ఇక్కడ విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ మంత్రి అలంగీర్ ఆలం మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే ఒక్కొక్కరికి రూ.10 కోట్లు, మంత్రి పదవి ఇస్తామని ఇతర ఎమ్మెల్యేలను ప్రలోభపెట్టినందుకు ముగ్గురు శాసనసభ్యులపై ఆ పార్టీ బెర్మో ఎమ్మెల్యే కుమార్ జైమంగల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పక్కా సమాచారం మేరకు పశ్చిమ బెంగాల్ పోలీసులు శనివారం సాయంత్రం కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఇర్ఫాన్ అన్సారీ, రాజేష్ కచ్చప్, నమన్ బిక్సల్ కొంగరి ప్రయాణిస్తున్న ఎస్‌యూవీని అడ్డగించగా, వాహనంలో భారీ మొత్తంలో నగదు ఉన్నట్లు తేలింది. విచారణ అనంతరం ఆదివారం మధ్యాహ్నం వారిని అరెస్టు చేశారు. 'రాజేష్ కచ్చప్, నమన్ బిక్సల్ కొంగరి నన్ను కోల్‌కతాకు రమ్మని అడిగారు. ఒక ఎమ్మెల్యేకు రూ.10 కోట్లు ఇస్తానని హామీ ఇచ్చారు. ఇర్ఫాన్ అన్సారీ, రాజేష్ కచ్చప్ నన్ను కోల్‌కతా నుంచి గువహటికి తీసుకెళ్లాలని అనుకున్నారు. అక్కడ వారి ప్రకారం అసోం ముఖ్యమంత్రి హేమంత్ బిస్వా శర్మతో సమావేశానికి నిర్ణయించారు' అని జై మంగల్ పేర్కొన్నారు. రాంచీలోని అర్గోరా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన తర్వాత, అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 7 (సి), నేరపూరిత కుట్రతో వ్యవహరించే ఐపీసీ సెక్షన్ 120 (బి) కింద ముగ్గురు ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని కోరినట్లు వివరించారు. ప్రజాస్వామ్య ఆరోగ్యానికి హాని కలిగించే నేర కార్యకలాపాలను అరికట్టాలని పోలీసులను కోరారు. కాగా పశ్చిమ బెంగాల్‌లో నగదు స్వాధీనం చేసుకున్నందున, వారు విషయాన్ని పొరుగు రాష్ట్రానికి బదిలీ చేస్తున్నట్లు అర్గోరా పోలీస్ స్టేషన్ అధికారి తెలిపారు.

బీజేపీ 'ఆపరేషన్ కమలం' బట్టబయలు : కాంగ్రెస్

హౌరాలో భారీ మొత్తంలో నగదుతో ముగ్గురు ఎమ్మెల్యేలు పట్టుబడిన తర్వాత జార్ఖండ్‌లో తమ సంకీర్ణ ప్రభుత్వాన్ని పడగొట్టడానికి బీజేపీ ప్రయత్నిస్తోందని కాంగ్రెస్ ఆరోపించింది. మహారాష్ట్రలో వారు చేసిన పనిని జార్ఖండ్‌లో చేయాలన్నది కాషాయ పార్టీ గేమ్ ప్లాన్ అని తెలిపింది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ శనివారం ట్విటర్‌లో 'జార్ఖండ్‌లో బీజేపీ 'ఆపరేషన్ కమలం' హౌరాలో ఈ రాత్రికి బట్టబయలైంది. ఇ-డి ద్వయాన్ని అమర్చడం ద్వారా మహారాష్ట్రలో ఏమి చేశారో జార్ఖండ్‌లోనూ అదేవిధంగా చేయాలన్నది దిల్లీలో 'హమ్ దో' గేమ్ ప్లాన్' అని ఆరోపించారు. ఇటీవలే మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా సేన తిరుగుబాటుదారుడు ఏక్‌నాథ్ షిండే ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత 'అనైతికంగా' అధికారాన్ని చేజిక్కించుకున్నందుకు బీజేపీపై కాంగ్రెస్ విరుచుకుపడింది. లాలూ ప్రసాద్ యాదవ్ రాష్ట్రీయ జనతాదళ్ ఒక భాగంగా ఉన్న హేమంత్ సోరెన్ ప్రభుత్వాన్ని పడగొట్టడానికి బీజేపీ చేసిన కుట్రలో భాగమే భారీ మొత్తంలో నగదు అని జార్ఖండ్ కాంగ్రెస్ పేర్కొంది.

కాంగ్రెస్ ఎమ్మెల్యేల సస్పెన్షన్

భారీ నగదుతో పోలీసులకు పట్టుబడిన జార్ఖండ్‌కు చెందిన ముగ్గురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై వేటు పడింది. ఆ ముగ్గురిని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయం తీసుకుంది. 'ముగ్గురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలను తక్షణమే సస్పెండ్ చేస్తున్నట్లు సోనియా గాంధీ నిర్ణయం తీసుకున్నారు. వీరి సస్పెన్షన్ అమలులోకి వస్తుంది' అని జార్ఖండ్ పార్టీ ఇన్‌ఛార్జి అవినాశ్ పాండే వెల్లడించారు. ఇందుకు సంబంధించి పార్టీలో ప్రతి ఒక్కరి సమాచారం తమ దగ్గర ఉందన్న ఆయన... ఇందులో ఎవరి ప్రమేయం ఉన్నట్లు తేలినా చర్యలు తీసుకుంటామని అన్నారు.

సిండి'కేట్లు'!

(మొదటిపేజీ తరువాయి)

ధరకు కేవలం 2 లక్షలే అదనంగా వ్యాపారులు వేలం పాడారు. ముందే పోటీ నుంచి ఏడుగురిని వైసీపీ కీలక నేత తప్పించినట్లు, ప్రతి ఒక్కరికీ రూ.20 లక్షల చొప్పున మామూళ్లు ఇచ్చినట్లు సమాచారం. ఎన్టీఆర్ జిల్లాలో బార్ల ఈ-వేలం ప్రక్రియ ముగిసింది. తిరువూరు మినహా అన్నిచోట్ల వ్యాపారులు సిండికేట్‌గా మారారు. తిరువూరులో అత్యధికంగా రూ.59 లక్షలకు షాపును దక్కించుకున్నారు. విజయవాడ కార్పొరేషన్ పరిధిలో 110 బార్లకు గానూ 109 బార్లకు వేలం వేశారు. ప్రభుత్వం రూ.50 లక్షలు నిర్ణయించగా, రూ.54 లక్షలకు వ్యాపారులు పాడారు. ప్రభుత్వ ధర కంటే రూ.4 లక్షలు మాత్రమే అధికంగా ఆదాయం వచ్చింది. తొలి రోజు బార్ల ఈ- వేలానికి రికార్డు స్థాయిలో ఆదాయం వచ్చింది. రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాల్లోని 323 బార్లకు ఈ-వేలం నిర్వహించగా మొత్తం రూ.258 కోట్ల ఆదాయం వచ్చింది. రాయలసీమ జిల్లాల్లో బార్ల వేలంలో ఎక్కువగా వైసీపీ నేతల మధ్య పోటీ నెలకొంది. కడపలో అత్యధికంగా ఓ బార్‌కు రూ.1.89 కోట్లు వెచ్చించి కైవసం చేసుకున్నారు. వైసీపీ ఎమ్మెల్యేల బెదిరింపులతో వ్యాపారులు వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది. ప్రధాన నగరాల్లో వైసీపీ నేతల అనుచరులకే బార్ల టెండర్లు ఇచ్చారు. సాధ్యంకాని ప్రాంతాల్లో భాగస్వామ్యం ఇవ్వాలని బెదిరించినట్లు సమాచారం. ఈ- టెండర్ల వ్యవహారంలో సిండికేట్ విధానం వల్ల రాష్ట్ర ప్రభుత్వ ఆదాయానికి కోట్లలో గండి పడిందని వ్యాపారులు భావిస్తున్నారు. కొందరు వైసీపీ కీలక నేత తెరవెనుక చక్రం తిప్పినట్లు ప్రచారం జోరందుకుంది.

అటకెక్కిన జగన్ వాగ్దానం

అధికారంలోకి వచ్చిన వెంటనే మూడు దశల్లో మద్యపాన నిషేధం చేస్తామంటూ నాడు జగన్ ఇచ్చిన వాగ్దానం, మూడేళ్ల తర్వాత అటకెక్కింది. మద్యాన్ని ఫైవ్‌స్టార్ హోటళ్లకే పరిమితం చేస్తామంటూ హామీ ఇచ్చి, నేడు ప్రజలను దగా చేశారనే విమర్శలున్నాయి. విచ్చలవిడిగా బార్లకు అనుమతులిస్తూ, మద్యాంధ్రప్రదేశ్‌గా మారుస్తుందనే ఆరోపణలు వినవస్తున్నాయి. అసలు మా మేనిఫెస్టోలో మద్య నిషేధమే లేదని సాక్షాత్తూ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ బుకాయించడాన్ని ప్రతిపక్షాలు తప్పుపడుతున్నాయి. మంత్రి వ్యాఖ్యలపై సర్వత్రా దుమారం రేగుతోంది. భగవద్గీత, ఖురాన్, బైబిల్‌గా ప్రకటించుకున్న మేనిఫెస్టోను వైసీపీ నేతలే మడత పెట్టేశారంటున్నారు.

పింఛను పెరిగేనా...?

న్యూఢిల్లీ : దేశంలో పేద వృద్ధులు తమ పింఛను మొత్తం ఎప్పుడు పెరుగుతుందా అని ఎదురు చూపులు చూస్తున్నారు. రూ.300గా ఉన్న పింఛను పెంపుదల కోసం 10 ఏళ్లుగా నిరీక్షిస్తున్నారు. మూడు వందల రూపాయలు అంటే, అది కొంతమందికి ఒక సినిమా టికెట్ లేదా ఒక కాఫీ, మరికొంత మందికి వారపు సరుకుల బడ్జెట్ లేదా ఒక 'ధాబా'లో సాధారణ కుటుంబ భోజనం కోసం ఖర్చు చేసే మొత్తం కావచ్చు. కానీ భారతదేశం అంతటా అనేక వేల మందికి వారి నెల మొత్తం పింఛను. ఇందిరాగాంధీ జాతీయ వృద్ధాప్య పింఛను పథకం, ఇందిరాగాంధీ జాతీయ వితంతు పింఛను పథకం, ఇందిరాగాంధీ జాతీయ వికలాంగుల పింఛను పథకం కింద అందజేసే పింఛను మొత్తం చివరిసారిగా 2012లో నెలకు రూ.200 నుంచి రూ.300కి పెరిగింది. అయితే 10 ఏళ్లుగా మరో పెంపు కోసం నిరీక్షణ కొనసాగుతోంది. దారిద్ర్య రేఖకు దిగువన (బీపీఎల్) కుటుంబాలకు చెందిన వారి కోసం జాతీయ సామాజిక సహాయ కార్యక్రమం (ఎన్ఎస్ఏపీ) కింద ప్రభుత్వం వివిధ పింఛను పథకాలను అమలు చేస్తుంది. కాగా అనేక మంది లబ్ధిదారులకు పెరుగుతున్న ధరల పరంగా సరిపోకపోయినా ఏదైనా పెరుగుదల స్వాగతించదగినది. 65 ఏళ్ల హీరీ దేవి 10 ఏళ్లుగా పక్షవాతంతో మంచాన పడి వికలాంగుల పింఛను పథకం కింద ప్రతి నెలా రూ.300 పొందుతోంది. '70 ఏళ్లు పైబడిన నా భర్త ఇటీవలి ద్రవ్యోల్బణం దృష్ట్యా రోజువారీ కూలీగా పని చేయడం ప్రారంభించాడు. ఈ డబ్బులో మాకు ఐదు రోజుల పాటు రేషన్ కూడా లభించదు' అని దిల్లీలోని జహంగీర్‌పురి కాలనీలో నివసిస్తున్న హీరీ దేవి పీటీఐకి చెప్పారు. అయితే కొన్ని నెలల క్రితం వరకు హీరీ దేవి స్వచ్ఛంద సంస్థల నుంచి అదనపు రేషన్ పొందుతోంది. కానీ కోవిడ్-19 మహమ్మారి పరిస్థితి మెరుగుపడటంతో అది నిలిచిపోయింది. కాగా వెంటనే ఉపశమనం కనిపించడం లేదు. మధ్యప్రదేశ్‌కు చెందిన కార్యకర్త చంద్ర శేఖర్ గౌర్ ఇటీవల దాఖలు చేసిన ఆర్‌టీఐ ప్రశ్నకు సమాధానంగా, జాతీయ సామాజిక సహాయక కార్యక్రమం, గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ, పథకాల కోసం నోడల్ మంత్రిత్వ శాఖ కింద అందించే పింఛను మొత్తాన్ని మార్చడానికి సంబంధించిన ప్రతిపాదన లేదని వెల్లడయింది.

ఆహార అవసరాలూ తీర్చదు... మందులూ కొనలేం...

72 ఏళ్ల లాలా రామ్ కూడా పక్షవాతానికి గురై స్పష్టంగా మాట్లాడలేకపోతున్నాడు. అతని కోడలు గంగ కుటుంబ బాధలను మౌఖికంగా చెప్పింది. 'పింఛనుతో సహా మొత్తం కుటుంబ ఆదాయం రూ.2,000. ఆరుగురు ఉన్న కుటుంబాన్ని పోషించడం చాలా కష్టం. పైగా, ఆదాయం నిలకడగా లేదు' అని దిల్లీలోని మయూర్ విహార్ ప్రాంతంలో నివసించే గంగ అన్నారు. అయితే కొంతమంది అనేక మూలాల నుంచి పింఛను పొందుతారు. 2015లో క్యాన్సర్‌తో తన భర్తను కోల్పోయానని, ఇందిరాగాంధీ వితంతు పింఛను పథకం, ఇందిరాగాంధీ జాతీయ వృద్ధాప్య పింఛను ద్వారా పొందే ఒక్కొక్కరికి రూ.300 పైనే ఆధారపడి ఉన్నానని పేరు వెల్లడించడానికి ఇష్టపడని 76 ఏళ్ల వృద్ధురాలు తెలిపింది. తన నిరుద్యోగి కొడుకుతో కలిసి రాంచీలో నివసిస్తున్న మహిళకు జార్ఖండ్ ప్రభుత్వం నుంచి కొంత డబ్బు కూడా వస్తుంది. కానీ మొత్తం రూ.2,500 చాలదు. 'ద్రవ్యోల్బణం చాలా ఎక్కువగా ఉంది. అది 10 రోజుల పాటు మన ఆహార అవసరాలను తీర్చదు. నేను మందులు కూడా కొనలేను' అని ఆమె ఫోన్‌లో పీటీఐకి తెలిపింది. ఏదిఏమైనా, దేశంలో పింఛన్లు ఎప్పటికీ సరిపోవు. కానీ అనేక కేంద్ర ప్రభుత్వ పథకాలలో ఆ మొత్తం వందల్లోనే ఉంది. రాష్ట్ర ప్రభుత్వ పథకాల్లో కొన్ని వేలల్లో మార్పు రావాల్సిన అవసరం ఉందని నిపుణులు అభిప్రాయపడ్డారు. 'రాష్ట్రాలు తమ సొంత పథకాలను కలిగి ఉన్నాయి. దిల్లీ, ఆంధ్రప్రదేశ్ అత్యధిక పింఛను ఇచ్చేవిగా ఉన్నాయి. కేంద్రం ఇస్తున్న దానికే సహకారం అందించే రాష్ట్రాలు ఉన్నాయి. 'ఈ మొత్తం తప్పనిసరిగా నెలకు కనీసం రూ.5 వేలు ఉండాలి' అని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) ప్రధాన కార్యదర్శి మురళీధరన్ చెప్పారు. కేంద్రం, రాష్ట్రాలు కలిపినా ఆర్థిక సాయం దేశంలో ఎక్కడా రూ.3,500 దాటడం లేదని వివరించారు. ఆర్‌టీఐలో పంచుకున్న వివరాల ప్రకారం, 2.9 కోట్ల మంది లబ్ధిదారులు ఎన్ఎస్ఏపీ కింద అన్ని పెన్షన్‌ల పథకాల పరిధిలోకి వచ్చారు. కాగా హెల్ప్‌ఏజ్ ఇండియాలో పాలసీ రీసెర్చ్ అండ్ అడ్వకేసీ హెడ్ అనుపమ దత్తా... కనీస మొత్తం రూ.5 వేలు ఉండాలన్న మురళీధరన్‌తో ఏకీభవించారు. ఆమె దృష్టిలో ప్రభుత్వం పేద వృద్ధులకు నెలకు రూ.5 వేలు ప్రాథమిక సామాజిక పింఛను భద్రత కల్పించాలి. 90 శాతం మంది వృద్ధులు బతకడానికి పని చేయాల్సి ఉంటుంది. కోవిడ్-19 మహమ్మారి కారణంగా వృద్ధులు, వారి కుటుంబాలు ఉపాధి, ఆదాయాన్ని కోల్పోయాయని, ఎక్కువగా అసంఘటిత రంగం నుంచి ఈ పరిస్థితి ఎక్కువగా ఉందని, మహమ్మారి నుంచి ఇంకా కోలుకోలేదని అనుపమ దత్తా తెలిపారు. 'ప్రభుత్వం రాష్ట్రాలకు ఇచ్చే కేంద్ర విరాళాన్ని రూ.200 నుంచి సవరించాలి (80 ఏళ్లలోపు వారికి 14 సంవత్సరాలు మారదు). ఇందిరాగాంధీ జాతీయ వృద్ధాప్య పింఛను పథకం కింద 80 ఏళ్లు పైబడిన వారికి రూ.500 కనీసం రూ.1,000, నెలకు రూ. 1,500' అని దత్తా చెప్పారు. కేంద్ర కేటాయింపుల్లో రాష్ట్రాలు విడివిడిగా అగ్రస్థానంలో ఉన్నాయి. బీహార్ దాని వృద్ధులకు (60-80 సంవత్సరాలు) రూ.400 నుంచి 500 మాత్రమే ఇస్తోంది. సార్వత్రిక కవరేజీతో ఇది ఏ ప్రమాణం కింద అయినా మనుగడకు సరిపోదు. ఛత్తీస్‌గఢ్ రూ.550 నుంచి 850 ఇస్తుంది. భారతదేశంలో అత్యధిక వృద్ధుల జనాభా ఉన్న ఉత్తరప్రదేశ్ వంటి పెద్ద రాష్ట్రం కూడా రూ.700 (60 ఏళ్లు పైబడిన వారికి), రూ.1,000 (80 ఏళ్లు పైబడిన వారికి) మంజూరు చేస్తోంది. దత్తా ప్రకారం, సీనియర్ సిటిజన్లకు పింఛను నిధిపై సంయుక్తంగా నిర్ణయించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒక కమిటీని ఏర్పాటు చేయడం పరిష్కారం. సామాజిక-ఆర్థిక కుల గణన 2011 ద్వారా గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ వివరాల ప్రకారం 50 శాతం మంది వృద్ధులు పేదలు. అలాగే దేశంలో 104 మిలియన్ల వృద్ధులు 60 ఏళ్లు పైబడిన వారు. దేశం మొత్తం జనాభాలో వీరు 8.6 శాతంగా ఉన్నారు.

పింఛను పొందాలంటే ఎన్ని కష్టాలో...

ఏజ్‌వెల్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, చైర్‌పర్సన్ హిమాన్షు రాత్ మాట్లాడుతూ పింఛను చాలా తక్కువగా ఉందని, సక్రమంగా లేదని ఎత్తి చూపారు. 'అనేక అధికార సంబంధమైన అడ్డంకులతో పింఛను పొందే ప్రక్రియ కూడా కష్టం. ఏ ప్రభుత్వ విభాగమైనా తీసుకోవడానికి ఇష్టపడే బాధ్యత శూన్యం' అని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం, అభ్యర్థి లేదా గ్రామ పంచాయితీ లేదా గ్రామసభ నుంచి వచ్చిన దరఖాస్తు ఆధారంగా లబ్ధిదారుని గుర్తింపు పొందవచ్చు. అన్ని సందర్భాల్లో, దరఖాస్తు ఫారం ఉప జిల్లా స్థాయి కార్యాలయాలకు సమర్పించాలి. గ్రామీణ ప్రాంతాల్లోని బ్లాక్‌లు, పట్టణ కేంద్రాల విషయంలో మున్సిపాలిటీలలో సమర్పించాలి. పింఛను కోసం కొత్త కేసును అంగీకరించే ముందు వివిధ స్థాయిల్లో ధ్రువీకరణ ఉంటుంది. అంతేకాకుండా, మరణాలు, వలసలు, బదిలీ చేయబడిన కేసులను గుర్తించడానికి క్రమం తప్పకుండా ధ్రువీకరణలు నిర్వహిస్తారు. దరఖాస్తును ధ్రువీకరించిన తర్వాత, మంజూరు చేసే అధికారం దానిని మంజూరు చేసిన తర్వాత, మంజూరు ఆర్డర్ నంబర్ కేటాయిస్తారు. ఆధార్ ఆధారంగా నెఫ్ట్, ఆర్టీజీఎస్ ఉపయోగించి సంబంధిత పింఛనుదారు బ్యాంక్ ఖాతాలకు ఎలక్ట్రానిక్ పద్ధతిలో నిధులు బదిలీ అవుతాయి. జులైలో ఏజ్‌వెల్ ఫౌండేషన్ నిర్వహించిన జాతీయ స్థాయి సర్వేలో ఐదుగురు సీనియర్ సిటిజన్లలో నలుగురు పెరుగుతున్న ద్రవ్యోల్బణం కారణంగా ఇబ్బంది పడుతున్నారని తేలింది. భారతదేశంలోని 24 రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాల్లో వివిధ సామాజిక-ఆర్థిక సమూహాలకు చెందిన 10 వేల మంది వృద్ధ ప్రతివాదులను కవర్ చేసిన ఈ సర్వే, దిగువ మధ్య-ఆదాయ వర్గాలు ఎక్కువగా బాధపడుతున్నాయని స్పష్టమయింది. ఈ వర్గానికి చెందిన 94 శాతం మంది పెరుగుతున్న ద్రవ్యోల్బణం తమను ప్రభావితం చేసిందని పేర్కొన్నారు.

ప్రజా సమస్యలపై రావిశాస్త్రి రచనలు

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎన్.వి.రమణ

పుస్తకావిష్కరణ చేస్తున్న ఎన్వీ రమణ, దుర్గాప్రసాదరావు, న్యాయమూర్తులు

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: విశాఖలో రాచకొండ విశ్వనాథ శాస్త్రి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎన్.వి.రమణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రావిశాస్త్రి శత జయంతి వేడుకల్లో భాగంగా ఆదివారం జిల్లా పరిషత్ జంక్షన్ సమీపంలో ఉన్న అంకుశ హాలులో జరిగిన కార్యక్రమంలో సీజే ఎన్.వి.రమణ మాట్లాడుతూ రావిశాస్త్రి తన రచనల్లో ప్రజా సమస్యలను, అలాగే సరిగా రాయని, అమలుకాని చట్టాలను ప్రస్తావించారని తెలిపారు. మాండలికాలను నిలబెట్టిన దిట్ట అని కొనియాడారు. ఆయన తన రచనలతో తెలుగువారిని ప్రభావితం చేశారని చెప్పారు. విశాఖలో ప్రశాంత వాతావరణం ఉందని, ఇక్కడి ప్రజలకు విశాల హృదయం ఉందని అన్నారు. ఒక సాహితీ వేత్తగా కాకుండా సాహిత్యాన్ని అభిమానించే వ్యక్తిగా వచ్చానని సీజే తెలిపారు. చాలా సుసంపన్నమైన కవితా మూర్తులను కన్నది విశాఖ అని, వచ్చే దారిలో నా ఫ్లెక్స్ హోర్డింగ్‌లు పెట్టడం నాకు బాధ కలిగించిందన్నారు. ఆ స్థానంలో రావిశాస్త్రి కవితలో వారి ఫొటోలు పెట్టి ఉంటే బాగుండేదన్నారు. సమాజంలో గిరీశంలు పెరిగిపోయారని, తెలుగు భాషను కాపాడుకోవాలంటే మాండలికాలను కాపాడుకోవాలన్నారు. రావిశాస్త్రి రచనలలో వస్తువులు సమాజంలో ప్రజలు, వారి ఇబ్బందులని అన్నారు. న్యాయవ్యవస్థ కోసం చక్కగా రావిశాస్త్రి కవితలో సీజే చెప్పారు. వారం వారం వచ్చే రత్తాలు-రాంబాబు సంపుటి కోసం ఎదురు చూసేవాళ్లమని అన్నారు. విశ్వ విద్యాలయం ఒక సామాజిక ప్రయోగ శాలని, అక్కడ నేర్చుకున్నదే ఎన్ని అటు పోటులు వచ్చినా ఎదుర్కొని నిలిచేలా చేసిందని తెలిపారు. న్యాయ వ్యవస్థ కోసం ఆరు సారా కథలను చదివితే అర్థం చేసుకోవచ్చు నన్నారు. అందుకే ఆరు సారా కథల పుస్తకాలు అచ్చు వేసి ఇచ్చానని సీజే చెప్పారు. రావిశాస్త్రి పార్లమెంట్ కోసం, శాసనసభ కోసం కథలో చక్కగా చెప్పారని, మన రాజ్యాంగం కోసం అందరికీ అర్థం అయ్యేలా తన కథలలో, రచనలో చెప్పారన్నారు. సమాజంలో వ్యవస్థల పై ప్రజలకు నమ్మకం పోతే ఏమవుతుందో రచనలో తెలిపారని అన్నారు. సరిగ్గా రాయని చట్టాలు, అమలుకాని చట్టాల కోసం చెప్పారన్నారు. ఈ మధ్యనే 124(ఏ) చట్టాన్ని కూడా రద్దు చేశామన్నారు. దశాబ్దాల క్రితం ఒక రావి గౌతముడుని ప్రభావితం చేసిందన్నారు. ఈ శతాబ్దంలో రావి ఒక్కరే సమాజాన్ని ప్రభావితం చేశారన్నారు. రావిశాస్త్రి రచనలను ఆంగ్లంలో తర్జుమా చేయాలని కోరిక ఉందని అన్నారు. ఎవరైనా ముందుకు వస్తే నేను ఆ పని చేయాలని అనుకుంటున్నానని సీజే చెప్పారు. రావిశాస్త్రి విశాఖ పై ఉన్న ప్రేమను యారాడ కొండ పై రచన చేసి చాటుకున్నారని అన్నారు. తన పదవీ విరమణ తర్వాత రావిశాస్త్రి, శ్రీశ్రీ వారి సాహిత్య కార్యక్రమాలు చేస్తానన్నారు. విశాఖ ప్రజలకు సముద్రమంత విశాల భావాలు ఉంటాయని, ప్రశాంతమైన విశాఖలో నివాసం ఉండాలని ఎక్కడెక్కడో ప్రజలు ఇక్కడ స్థిరపడుతున్నారని తెలిపారు. రావిశాస్త్రి రచనలకు ప్రభావితమై తాను జీవన శైలి నేర్చుకున్నానని, రావిశాస్త్రి పేదల పక్షాన నిలిచిన న్యాయవాది అని సీజే ఎన్.వి.రమణ కొనియాడారు. తెలుగువాడు కావడం వల్లే రావిశాస్త్రికి ప్రపంచ స్థాయి గుర్తింపు రాలేదన్న బాధ ఉందని, నా ఉద్యోగం గొప్పది కావచ్చుకానీ రావిశాస్త్రి గారి కంటే తక్కువేనన్నారు. విశాఖలో కొన్ని ప్రధాన ప్రాంతాల్లో రావిశాస్త్రి సూత్రాలు ఏర్పాటు అవసరమన్నారు. ఉత్తరాంధ్ర మాండలికంలో రావిశాస్త్రి రచనలు ఈ ప్రాంతం విశిష్టత పెంచాయని, మంచి, చెడు, మోసకారి తనం, పీడిత తనం రావిశాస్త్రి రచనల్లో కనిపించిందన్నారు. లోకంలో పాపం పుణ్యాలు లేవని, వ్యాపారం మాత్రమేనని రావిశాస్త్రి చెప్పిన మాటల్లో ఇప్పటికీ నిజం ఉందని తెలిపారు. భాష లేనిదే బతుకు లేదని, అందువల్ల తెలుగు భాషను కాపాడాలని, తెలుగులో మాట్లాడాలని, పిల్లలకు తెలుగు పుస్తకాలు ఇచ్చి చదివించాలని విజ్ఞప్తి చేశారు. ప్రారంభ సభలో రావిశాస్రి రచనలు నేటి యువతకు మార్గదర్శకమని హైకోర్టు న్యాయమూర్తి దుర్గాప్రసాదరావు అన్నారు. ముందుగా జ్యోతి ప్రజల్వన చేసి, రావిశాస్త్రి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాచకొండ రచన కవిత్వంలో భాష, భావం, శిల్పం, బాపు కథ కనిపిస్తుందన్నారు. నేటి ఆధునిక యుగంలో యువత ఫేస్‌బుక్ వైపే చూస్తున్నారు తప్ప ఫేస్ బుక్కుల వైపు చూడడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. యువత రాచకొండ రచనలు చదవడం చాలా అవసరం అన్నారు. రాచకొండ కథలలో ఉత్తరాంధ్ర మాండలికం ఉంటుందని, రావి భావాలు లేజర్ కన్నా పదునుగా ఉంటాయన్నారు. అంతకుముందు సీనియర్ జర్నలిస్టు మంగు శివరాం ప్రసాద్ రాసిన 'పందేళ్ల రావికి వందనం' పుస్తకాన్ని న్యాయమూర్తి ప్రసాదరావు ఆవిష్కరించారు. ఈ సభకు డాక్టర్ రఘునాథరావు అధ్యక్షత వహించగా, ఈ కార్యక్రమంలో ఆచార్య సిమ్మన్న, రాంబట్ల నరసింహ శర్మ, డాక్టర్ జీకే వేణు, డాక్టర్ వి.కృష్ణమూర్తి, రావిశాస్త్రి కుమారుడు ఉమకుమార శాస్త్రి, కుమార్తె పార్వతితో పాటు సాహిత్యకారులు, కళాకారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఇంటింటా జాతీయ జెండా ఎగరాలి

పింగళి స్వగ్రామంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

విశాలాంధ్ర-కూచిపూడి: డెబ్బై ఐదేళ్ల ఏళ్ల స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహిం చాలని కేంద్రం నిర్ణయించినట్లు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. స్వాతంత్ర్య సమర యోధులు, త్యాగధనుల గురించి తెలుసు కునేలా కార్యక్రమాలు చేపట్టామని, ఈ కార్యక్రమంలో అన్ని రాష్ట్రాలను భాగస్వామ్యం చేస్తున్నామని పేర్కొన్నారు. ఆగస్టు 2న పింగళి వెంకయ్య శత జయంతి వేడుకలను ఢిల్లీలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం ఆయన పింగళి స్వగ్రామమైన కృష్ణా జిల్లాలోని భట్లపెనుమర్రు గ్రామాన్ని సందర్శించి పింగళి కుటుంబసభ్యులను కలుసుకున్నారు. ఢిల్లీలో జరిగే పింగళి శతజయంతి కార్యక్రమానికి ప్రధాని తరపున ఆహ్వానిం చడానికి వచ్చానన్నారు. ఈ కార్యక్రమంలో పింగళి కుటుంబ సభ్యులను ప్రధాని, అమిత్ షా సన్మానిస్తారని వెల్లడించారు. ఢిల్లీలో పింగళి ఫొటోతో పోస్టల్ స్టాంప్ విడుదల చేస్తామని అలాగే.. ఆయన రూపొందించిన జాతీయ జెండాను ప్రదర్శిస్తామని తెలిపారు. ఆగస్టు 2న పింగళి జయంతి సభ వేదికపై ప్రత్యేక గీతాన్ని విడుదల చేస్తామని ప్రకటించారు. తొలుత ఆయన భట్లపెనుమర్రు గ్రామంలో పింగళి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం ఆయన పేరిట నిర్మించిన సామాజిక భవనంలో పూల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఆగస్టు 13-15 వరకు దేశంలో ప్రతి ఇంటిపై జాతీయ జెండా రెపరెపలాడాలని ఆకాంక్షించారు. 'హర్ ఘర్ తిరంగా-ఘర్ ఘర్ తిరంగా' పేరుతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని.. పార్టీలు, రాజకీయాలకు అతీతంగా ఇళ్లపై జెండా ఎగురవేయాలని కోరారు.

ఆగస్టు 3న ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ నుంచి విజయ్ చౌక్ వరకు యాత్ర ఉంటుందని తెలిపారు. మోటార్ సైకిల్‌పై తిరంగా యాత్రలో ఎంపీలు పాల్గొంటారని పేర్కొన్నారు. ఆగస్టు 14న 'పాక్ విభజన్ కా విదుష్ కా స్మృతి దివస్' పేరుతో కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ఆగస్టు 14న రాత్రి అందరూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్యం కోసం పోరాడిన అల్లూరి సీతారామరాజు, పింగళి వెంకయ్య లాంటి మహనీయులను ఏనాడు మర్చిపోరాదన్నారు. పింగళి వెంకయ్య స్వగ్రామాన్ని సందర్శించడం తన పూర్వజన్మ సుకృతం అన్నారు. గ్రామానికి రహదారి సౌకర్యం ఏర్పాటుకు, పింగళి వెంకయ్య స్థూపం ఆధునీకరణకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పింగళి వెంకయ్య వనుమడు భార్య సుశీలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు నాయకులు మర్తా ప్రసాదు, శ్రీనివాస వర్మ, బిట్ర వెంకట శ్రీమన్నారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

వరద బాధిత కుటుంబానికి రూ.10 వేలు ఇవ్వండి

పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయండి

సీఎస్‌కు చంద్రబాబు లేఖ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: గోదావరి వరదలు, భారీ వర్షాలు, లంక గ్రామాలు, పోల వరం విలీన మండలాల బాధితులకు ప్రభుత్వం మెరుగైన సాయమందించాలని టీడీపీ అధినేత, మాజీ సీఎం నారా చంద్రబాబునాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీర్‌శర్మకు ఆదివారం ఆయన ఓ లేఖ రాశారు. రాష్ట్రంలో గోదావరి వరదలు, భారీ వర్షాలకు ఐదు జిల్లాల్లో లక్షలాది మంది తీవ్ర ప్రభావానికి లోన య్యారని తెలిపారు. నాలుగు జిల్లాల్లోని మారు మూల ప్రాంతాల్లో పర్యటించి వరద బాధితుల బాధలు స్వయంగా పరిశీలించానని గుర్తుచేశారు. పి.గన్నవరం, రాజోలు, ఆచంట, పాలకొల్లు, నరసాపురం, పోలవరం, రంపచోడవరం నియో జకవర్గాల్లోని మారుమూల ప్రాంతాల్లో పర్యటించి దయనీయ స్థితిలో ఉన్న ప్రజలను కలుసుకు న్నానన్నారు. లంక గ్రామాలతో పాటు, పోలవరం విలీన మండలాల్లో దారుణ పరిస్థితులు తీవ్రంగా కలిచి వేశాయని, ప్రభుత్వం చేయాల్సిన సాయంపై మీ దృష్టికి తెచ్చేందుకు ఈ లేఖను రాస్తున్నానని పేర్కొన్నారు. వరదలపై ముందస్తు హెచ్చరికలు ఉన్నప్పటికీ అందుకు అనుగుణంగా అధికార యంత్రాంగం సిద్ధంకాలేదని విమర్శిం చారు. పసిపిల్లలకు పాలు లేని పరిస్థితి నెలకొందన్నారు. ఆస్తి నష్టం మరింత తీవ్రంగా ఉందని వివరించారు. ఇళ్లు కూలిపోయి, ఇంట్లో సామగ్రి వరద నీటిలో కొట్టుకుపోయాయన్నారు. గృహోపకరణాలు పనికి రాకుండా పోవడం వల్ల వేలాది మంది పెద్ద ఎత్తున నష్టపోయారని, గ్రామాలు వారం రోజుల పాటు వరదలో ఉండిపోవడంతో నష్టం రెట్టింప యిందని తెలిపారు.

కుటుంబానికి రూ.2వేల సాయం న్యాయబద్ధంగా లేదనీ, నష్టంతో పోల్చుకుంటే ప్రభుత్వం ఇచ్చే సాయం వారికి ఏ రకంగానూ అక్కరకు రాదన్నారు. కుటుంబానికి కనీసం రూ.10వేలు ఇవ్వాల్సిన అవసరముందని డిమాండ్ చేశారు. . పోలవరం కోసం తమ భూములు, ఊళ్లు ఇచ్చి త్యాగం చేసిన నిర్వాసితులకు న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. పోలవరం విలీన, ముంపు మండలాల్లో గిరిజనుల హక్కులను కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. అరకొర వసతుల మధ్య రోజులు గడుపుతున్న వరద బాధితులను సహృదయంతో ఆదుకోవాలని కోరారు.

ఫోరెన్సిక్ ల్యాబ్‌తో కేసు దర్యాప్తు వేగవంతం: వనిత

విశాలాంధ్రబ్యూరో- అనంత పురం: అనంతపురం పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో నూతనంగా నిర్మించిన రీజినల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ (ఆర్ఎఫ్ఎస్ఎల్)ను ఆది వారం హోంమంత్రి తానేటి వనిత ప్రారంభించారు. ఏదైనా ఘటన/ కేసు నమోదైనప్పుడు, దానిని వేగవంతంగా పూర్తి చేయాలంటే ఈ ఆర్ఎఫ్ఎస్ఎల్ ఎంతో ఉపయోగ పడుతుందని వనిత అన్నారు. ప్రజలకు సత్వర న్యాయం చేసే దిశగా జీరో ఎఫ్ఐఆర్ తీసుకొచ్చామన్నారు. విపత్కర పరిస్థితుల్లో పోలీసులు ఎన్నో త్యాగాలు చేస్తూ ప్రజలకు మెరుగైన సేవలందించడం అభినందనీయమన్నారు. ప్రతీ పోలీసు స్టేషన్లో రిసెప్షన్ సెంటర్లు ఏర్పాటు చేసి సేవలు అందిస్తున్నామనీ, దిశ చట్టం అమలులో రాకపోయినప్పటికీ ఈ చట్టంలో రూపొందించిన ప్రకారంగా దిశ పోలీసు స్టేషన్లు, తదితరాలు ఏర్పాటు చేసి మహిళలకు సత్వర న్యాయం చేస్తున్నా మన్నారు. డీజీపీ కేవీ రాజేంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ కేసుల్లో సత్వర విచారణ జరగాలన్న ఉద్దేశంతో ఇక్కడి పీటీసీలో ఈ ల్యాబ్‌ను ఏర్పాటు చేశా మన్నారు. రాష్ట్రంలో 13 వేలు నమూనాలను విశ్లేషించి ఆ నివేదికలు సంబంధిత పోలీసు స్టేషన్లకు పంపే విధంగా ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లు ఉన్నాయనీ, కేసుల పరిష్కారంలో ఈ ల్యాబ్‌లు కీలకపాత్ర పోషించనున్నాయని తెలిపారు.. మరో పెద్ద ఆర్ఎఫ్ఎస్ఎల్ నూతనంగా నిర్మితం కానుందని, మరింత మెరుగైన ఫలితాలు అందిస్తామని చెప్పారు.12మంది సైంటిఫిక్ సిబ్బందితో ఇక్కడ సేవలు అందించనున్నామని వివరించారు. రాజమండ్రిలో కూడా త్వరలో ల్యాబ్‌ను ప్రారంభించబోతున్నామన్నారు. రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖామాత్యులు ఉషశ్రీ చరణ్ మాట్లాడుతూ పోలీసులు మరింత మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు.

సమస్యల పరిష్కారంలో దిట్ట

పదవీ విరమణ సభలో ఎన్ఎఫ్‌టీఈ నేతలు

విశాలాంధ్ర-విజయవాడ (అజిత్‌సింగ్‌నగర్): ఉద్యోగుల సమస్యల పరిష్కారం లోను, యూనియన్ బాధ్యతల నిర్వహణలోనూ చంద్రశేఖర్ దిట్ట అని సంఘ నేతలు వ్యాఖ్యానించారు. బీఎస్ఎన్ఎల్ విజయవాడ సర్కిల్ కార్యాల యంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించిన చింతలూరి చంద్రశేఖర్ ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా హనుమాన్‌పేట దాసరిభవన్‌లో ఆదివారం ఎన్ఎఫ్‌టీఈ-బీఎస్ఎన్ఎల్ ఏపీ సర్కిల్ రాష్ట్ర కార్యదర్శి కె.అంజయ్య అధ్యక్షతన అభినందన సభ జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎన్ఎఫ్‌టీఈ జాతీయ ప్రధాన కార్యదర్శి చండేశ్వర్ సింగ్ మాట్లాడుతూ, బీజేపీ ప్రభుత్వం పబ్లిక్‌రంగ సంస్థలను కార్పొరేట్ దిగ్గజాలకు అప్పగించేందుకు ప్రణాళికా బద్ధంగా ముందుకు వెళు తుందన్నారు. కేంద్రం బీఎస్ఎన్ఎల్‌ను బలోపేతం చేయటానికి రూ. లక్షా అరవైమూడు వేల కోట్లు మంజూరు చేసిందన్నారు. అయితే ఇది ఉద్యోగుల కోసం కాదని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేందుకు మాత్రమేనన్న అనుమానం వ్యక్తం చేశారు. బీఎస్ఎన్ఎల్ మనుగడ సాగించాలంటే 4జీ సేవలను వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకురావాల్సి ఉందన్నారు. ఏఐటీయూసీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు మాట్లాడుతూ, ప్రభుత్వాలపై ప్రజలు అసంతృప్తిగా ఉన్నప్పుడు వారి దృష్టి మరల్చటానికి కొత్త వివాదాలను సృష్టిస్తాయని ఆరోపించారు. ఎన్ఎఫ్‌టీఈ యూనియన్ నాయకుడిగా చంద్రశేఖర్ ఎంతో బాధ్యతతో వ్యవహరించారని కొనియాడారు. వ్యవస్థలు సక్రమంగా నడవటానికి ప్రజా ఉద్యమాల అవసరం ఉందన్నారు. ఎన్ఎఫ్‌టీఈ తెలంగాణ సర్కిల్ కార్యదర్శి ఎ.రాజమౌళి మాట్లాడుతూ, బీఎస్ఎన్ఎల్‌లో మరోసారి వీఆర్ఎస్ (స్వచ్ఛంద పదవీ విరమణ) వచ్చే అవకాశం లేదని సీఆర్ఎస్ (కంపల్సరీ పదవీ విరమణ) వచ్చే అవకాశం ఉందన్నారు. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లోని వివిధ జిల్లాల నుంచి యూనియన్ నాయకులు హాజరై చంద్రశేఖర్‌ను అభిందించారు. చంద్రశేఖర్, శ్రీదేవి దంపతులను దుశ్శాలువా, పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. జె.వి.రమణ (కర్నూల్), గురప్ప (తిరుపతి), దుర్గారావు (ఖమ్మం), నాగేంద్రబాబు (విజయవాడ), సేవా బీఎస్ఎన్ఎల్ తరుపున మహేశ్వరరావు ప్రసంగించారు.

రిజర్వేషన్లకు బీజేపీ ఎసరు

- రిజర్వేషన్లు కాపాడుకునేందుకు నిరంతర పోరాటాలు
- భూమి, భుక్తి, వెట్టిచాకిరి విముక్తి కోసం ఉద్యమాలు

మాట్లాడుతున్న కరవది సుబ్బారావు, పక్కన జేవీ ప్రభాకరరావు. గోపి, శ్రీరామమూర్తి, పోలారావు తదితరులు

విశాలాంధ్ర-టెక్కలి: రాజ్యాంగం సమీక్షిస్తామనే పేరుతో బీజేపీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఉన్న రిజ ర్వేషన్లు ఎత్తేసేందుకు కుట్ర పన్నుతోందని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జేవీ ప్రభాకర రావు, కరవది సుబ్బారావు ఆరోపించారు. టెక్కలి మండలం తొలుసూరుపల్లి రోడ్డులో గల పూర్ణ కల్యాణ మండపంలో జరిగిన డీహెచ్‌పీఎస్ శ్రీకాకుళం 3వ జిల్లా మహాసభలో ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు దారి మళ్లించి నిలిపివేశారన్నారు. ఎస్సీలకు ఇస్తున్న 18 సంక్షేమ పథకాలు జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం నిలిపివేసింది, వెంటనే ఆ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం, విద్య, ఉపాధి కోసం నిరంతరం దళితుల సమస్యలపై గళమెత్తి పోరాడుతున్నది డీహెచ్‌పీఎస్ అన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులపై దాడులు పెరిగాయన్నారు. అట్టడుగున ఉన్న దళితులు, కార్మికులు, రైతులకు అన్యాయం చేసిన ఏ ప్రభుత్వం మనుగడ సాగించలేదన్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం జోలికి వస్తే దళితులచే తీవ్రమైన ప్రతిఘటన ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఈ కార్యక్రమానికి డీహెచ్‌పీఎస్ నేత గోపీ అధ్యక్షత వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి బలగ శ్రీరామ్మూర్తి, సమాచార హక్కు చట్టం రక్షణ వేదిక జిల్లా అధ్యక్షులు అనపాన షణ్ముఖ రావు, మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రవంతి పాలపోలా రావు, బలగ రామారావు, చిట్టి సింహాచలం, సామ హిరణ్య రావు, జామాన రామారావు, చింతల సరస్వతమ్మ, బసవల భాగ్యలక్ష్మి, చిట్టి వరలక్ష్మీ, బమ్మిడి వేణుగోపాల్, నాగవంశం త్రినాథ్, పంచెల శ్రీను, మీసాల వెంకట రావు, ముంజేటి.రాము, వడ్డి దాలయ్య,రేగు గాసయ్య తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు జన నాట్యమండలి ఉదయ్ భాస్కర్ బృందం ఆలపించిన అంబేద్కర్ గేయాలు ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి. తొలుత అంబేద్కర్ సామాజిక భవనం వద్ద, అంబేద్కర్ జంక్షన్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి అలంకరించారు. అనంతరం డప్పు కళాకారుల ప్రదర్శనల మధ్య డీహెచ్‌పీఎస్ కండువాలు, జండాలతో నీలి రంగులో టెక్కలి పురవీధులు అంబేద్కర్ నినాదాలతో మారు మోగాయి. అనంతరం డీహెచ్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా యడ్ల గోపీ, అధ్యక్షులుగా పాల పోలారావు లతో పాటు మరో 19 మంది కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

నేటినుంచి వైఎస్ఆర్ పెన్షన్లు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైఎస్ఆర్ పెన్షన్ల కానుక కింద 62.79 లక్షల మంది లబ్ధిదారులకు పెన్షన్ల పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేసినట్టు రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి బుడితి ముత్యాల నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జులై పెన్షన్ల మొత్తాలను ఈనెల 1వ తేదీనే నేరుగా లబ్ధిదారులకు ఇంటి వద్దే అందించనున్నట్టు చెప్పారు. తెల్లవారుజాము నుంచే వలంటీర్లు పెన్షన్ల పంపిణీ ప్రారంభిస్తారని పేర్కొన్నారు. 62.79 లక్షల మంది పెన్షనర్లకు రూ.1596.77 కోట్లు ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. 2.66 లక్షల మంది వలంటీర్లను సిద్ధం చేసినట్టు చెప్పారు. సాంకేతిక కారణాల రీత్యా ఏ ఒక్కరికీ పెన్షన్ అందలేదనే ఫిర్యాదు రాకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టారు. ఐదు రోజుల్లో నూరు శాతం పంపిణీ పూర్తయ్యేలా వలంటీర్లకు మార్గదర్శకాలు జారీచేశారు.

మోదీ పాలనలో తారస్థాయికి పేదరికం: ఆవుల శేఖర్

మాట్లాడుతున్న ఆవుల శేఖర్. పక్కన జాఫర్, కేశవరెడ్డి, పెద్దయ్య, నాగమణి తదితరులు

విశాలాంధ్ర-అనంతపురం అర్బన్: గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న నిరు పేదలు, వ్యవసాయ కూలీల సమస్యలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం నగరంలోని నీలం రాజశేఖర రెడ్డి భవన్‌లో నిర్వహించిన వ్యవసాయ కార్మిక సంఘం అనంతపురం జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ఆవుల శేఖర్ ప్రసంగించారు. ప్రధానిగా మోదీ బాధ్యతలు చేపట్టిన 8 ఏళ్లలో 80 కోట్ల మంది పేదరికంలోకి కూరుకుపోయారని తెలిపారు. 22 కోట్ల మంది నిరుద్యోగులు తయారయ్యారని చెప్పారు. పేదరిక నిర్మూలనకు మోదీ ప్రభుత్వం వద్ద ప్రణాళికలు లేవని విమర్శించారు. వట్టి హామీలతో ప్రజలను మోదీ ప్రభుత్వం మోసగిస్తోందని దుయ్యబట్టారు. గ్రామీణ ప్రజానీకానికి ఉపయోగపడే మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం, అటవీ హక్కుల సంరక్షణ, ఆహార భద్రత, భూ సేకరణ, కార్మిక చట్టాలను నీరుగారుస్తోందని మండిపడ్డారు. దేశంలో మతోన్మాదాన్ని పెంచి రాజకీయ పబ్బం గడుపుకుంటోందని బీజేపీపై ఆగ్రహం వ్యక్తంచేశారు. గ్రామీణ పేదలకు ఇళ్ల స్థలాలు, పక్కాగృహాలు, పింఛన్లు, రుణాలు తదితర సమస్యలపై ఆగస్టు 1 నుంచి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ నిరసన కార్యక్రమాల్లో పేద ప్రజలందరూ భాగస్వాములై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ మాట్లాడుతూ... కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు నిలదీయాలని గ్రామీణ పేదలకు సూచించారు. వ్యవసాయ కార్మిక సంఘం చేసే పోరాటాలకు సీపీఐ అండగా ఉంటుందన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కేశవరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఉపాధి కూలీలకు చెల్లించాల్సిన రూ. 38 కోట్ల బకాయిలు తక్షణం చెల్లించేలా చర్యలు చేపట్టాలని అధికారులను డిమాండు చేశారు. ఉపాధి హామీ పథకం నీరుగారకుండా ఆగస్టు 4 న జిల్లా కలెక్టరేట్ వద్ద వామపక్ష వ్యవసాయ కార్మిక సంఘాలు ఆందోళనకు పిలుపునిచ్చినట్టు తెలిపారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పెద్దయ్య, జిల్లా ఉపాధ్యక్షులు తిరుపాల్, నాగమణి, దేవేంద్ర, జిల్లా కార్యదర్శులు నారాయణమ్మ, సూర్యనారాయణ, బండారి శివ, దేవేంద్ర, రమణ, లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.

పోరాట ఫలితమే సంక్షేమ బోర్డు

- 1996 నాటి చట్టాన్ని అమలు చేయాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు హరినాథరెడ్డి

జెండాను ఆవిష్కరిస్తున్న హరినాథరెడ్డి. పక్కన రాధాకృష్ణ, శ్రీరాములు, విశ్వనాథ్, రవి, శివ, బలరాం తదితరులు

విశాలాంధ్ర-తిరుపతి: ఏఐటీయూసీ పోరాటాల ఫలితంగా దేశంలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటైందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి హరినాథ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం తిరుపతిలోని ఎంఆర్ పల్లి, సీతమ్మ నగర్‌లో భవన నిర్మాణ కార్మిక సంఘం నేత ఈ. ఏసు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హరినాథ్ రెడ్డి మాట్లాడుతూ సీపీఐ అనుబంధ సంఘంగా ఉన్న ఏఐటీయూసీ పోరాటాల కారణంగా ఐదు మందితో కూడిన కమిటీ నిర్ణయం మేరకు 1996 భవన నిర్మాణ కార్మిక చట్టం తయారైందని తెలిపారు. 55 సంవత్సరాలు నిండిన కార్మికులకు నెలకు రూ.3 వేలు పెన్షన్ మంజూరు చేయాలని, పనిచేస్తూ ప్రమాదవశాత్తు మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం రూపాయలు ఆరోగ్యంతో మరణిస్తే రూ.60 వేలు, దహన క్రియలకు రూ.20 వేలు, మెటర్నటీ బెనిఫిట్ కింద రెండు కాన్పులకు రూ.40 వేలు, కార్మికులుకు పెళ్లి కానుకగా రూ.20 వేలు ఇవ్వాలన్న సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయకపోగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు భవన నిర్మాణ కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయని మండి పడ్డారు . సీపీఐ జిల్లా కార్యదర్శి పి మురళి, జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య మాట్లాడుతూ ఆగస్టు 14న జరిగే తిరుపతి జిల్లా ప్రథమ మహాసభ బహిరంగ సభలో కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. భవన నిర్మాణ కార్మికుల హక్కుల సాధనకై జరిగే పోరాటానికి సీపీఐ నిత్యం అండగా ఉంటుందన్నారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి, కె.రాధాకృష్ణ, ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ శ్రీరాములు మాట్లాడుతూ..2018 నుంచి పెండింగ్‌లో ఉన్న బకాయిత విడుదలకై, భవన నిర్మాణ కార్మిక సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 9వ తేదీ క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట జరిగే ధర్నాని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి జె విశ్వనాథ్, ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి ఎన్‌డి రవి, నగర కార్యవర్గ సభ్యులు ఎన్. శివ, అర్.బలరాం, జి.శశి కుమార్, వి. ఉదయ్ కుమార్, ఎపి బాల, ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం నగర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఉప్పు హరిబాబు శెట్టిపల్లి రవి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల ఛేదనలో పురోగతి అవసరం: డీజీపీ



విశాలాంధ్రబ్యూరో-అనంతపురం: అనంతపురం పోలీసు శిక్షణా కళాశాలలోని ఆడిటోరియంలో 'సైబర్ క్రైం ఇన్వెస్టిగేషన్ టి.ఓ.టి కోర్సు-2022" పై నిర్వహించిన శిక్షణా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర డీజీపీ కేవీ రాజేంద్రనాథ్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. ప్రస్తుత పరిస్థితుల్లో సైబర్ నేరాల ఛేదింపు కీలకంగా పరిణ మించిందనీ, ఎక్కడో దూర ప్రాంతాల్లో ఉంటూ వేరే ప్రదేశాల్లో ఉన్న వ్యక్తుల అకౌంట్లను ట్యాంపర్ చేయడం, డబ్బు దోచుకోవడం తరుచూ జరుగుతున్నారు. లోన్ కావాలనో, లాటరీ తగిలిందనో నమ్మబలుకుతూ ఓటీపీ నంబర్ సేకరించి తద్వారా బ్యాంకు అకౌంట్లను ఖాళీ చేస్తుండటం చూస్తున్నామనీ, వీటిపై పెద్దగా అవగాహన లేకపోవడం వల్ల బాధితులు పోలీసు స్టేషన్లకు వచ్చినప్పుడు ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉండే పరిస్థితులు ఉన్నాయన్నారు. అలాంటి పరిస్థితులు రానీయకుండా కచ్చితంగా దర్యాప్తుపై అవగాహన ఉండాలని, శిక్షణలో నేర్చుకున్నది ఆయా స్టేషన్లకు వెళ్లి మిగతా వారికి తెలియజేస్తేనే మంచి ఫలితాలుంటాయని డీజీపీ ఆశాభావం వ్యక్తం చేశారు. ఐజీపీ, పీటీసీ ప్రిన్సిపాల్ వెంకట్రామిరెడ్డి, అనంతపురం రేంజ్ డీఐజీ ఎం.రవిప్రకాష్, అనంతపురం జిల్లా ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప కాగినెల్లి , శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్, పీటీసీ వైస్ ప్రిన్సిపాల్ గీతాదేవి పాల్గొన్నారు.

రావి శాస్త్రి రచనలు అజరామరం

సాహితి

డా॥ శిఖామణి, 9848202526

"రచయిత అయిన ప్రతివాడు తాను రాస్తున్నది ఏ మంచికి హాని కలిగిస్తుందో ఏ చెడ్డకు ఉపకారం చేస్తుందో అని ఆలోచించవలసిన అవసరం ఉందని తలుస్తాను. మంచికి హాని, చెడ్డకు సహాయమూ చెయ్యకూడదని నేను తలుస్తాను" అని రచయిత మంచి వైపు నిలబడవలసిన అవసరాన్ని గుర్తు చేయడమే కాకుండా తాను మంచి వైపు నిలబడ్డ మహారచయిత రాచకొండ విశ్వనాథశాస్త్రి. రావిశాస్త్రి 30 జులై 1922 న జన్మించారు. ఇది ఆయన శతజయంతి సంవత్సరం. ముందుగా ఆ మహారచయితకు శత జయంతి నివాళులు.

అల్పజీవి, రాజు-మహిషి, రత్తాలు-రాంబాబు, సొమ్ములు పోనాయండి, ఇల్లు వంటి నవలలు, గోవులొస్తున్నాయి జాగ్రత్త, ఆరు సారా కథలు, మూడు కథల బంగారం, బుక్కులు, బాకీ కథలు వంటి కథా సంపుటాలు వెలువరించారు. తన రచనల్లో ఉత్తరాంధ్ర జిల్లాల జీవమైన మాండలిక భాషను అత్యంత సహజంగానూ, అలవోకగాను ప్రవేశపెట్టి వాటికి జవమూ జీవమూతో పాటు కళా ఖండాలనదగిన శాశ్వతత్వాన్ని చేకూర్చి పెట్టారు. రావిశాస్త్రి రచనల్లోని కవితాత్మక శైలిని పట్టి చూడడం ఈ వ్యాసం ముఖ్యోద్దేశం.

అసలు ఒక రచయిత రాసే రచనలో, ముఖ్యంగా కథ, నవల, వ్యాసం వంటి రచనలో కవితాత్మక వచనం, లేదా కవితాత్మక శైలి చోటు చేసుకోవడానికి కారణాలేమై ఉంటాయి అని ప్రశ్నించుకున్నపుడు దొరికే మొట్ట మొదటి సమాధానం అతడు భావుకుడు కనక. భావుకత్వం లేనిదే ఒక రచయిత ఎట్లా అవుతాడు అని వెంటనే మరొక ప్రశ్న ఉత్పన్నం అవుతుంది. దానికి సమాధానం మామూలు భావుకత్వం కంటే, ఉదాత్తమైన భావుకత్వం కలిగిన వాడై వుండాలి, లేదా మౌలికంగా ప్రాథమికంగా అతనకవైనా అయియుండాలని మరొక సమాధానం. ఇటువంటి సందర్భాల్లో ఆయా రచయితల నేపథ్యాల్లోకి, మూలాల్లోకి తొంగిచూస్తే ఈ కవితాత్మక శైలిలో రాయడానికి కారణాలు కొన్నయినా దొరుకుతాయి, తెలుస్తాయి. తెలుగులో చలం, బుచ్చిబాబు, పాలగుమ్మి పద్మరాజు, తిలక్, నండూరి రామ మోహనరావు వంటి రచయితలు మొదట కవిత్వ రచనతో సాహిత్య ఆరంగ్రేటం చేసి, అటు తర్వాత వచన రచన వైపు మళ్ళారు. తిలక్ లాంటి కొందరు అటు కవిత్వాన్ని ఇటు వచనాన్ని సమపాళ్ళలో నడిపిన వారూ ఉన్నారు. కాల్పనికోద్యమంలో రచయితగా కాలూనిన చలం బ్రహ్మ సమాజ ఉద్యమ ప్రచారంలో భాగంగా అద్భుతమైన గేయ సాహిత్యాన్ని సృజించారు. బైబిలు, గీతాంజలి వంటి గ్రంథాలను గొప్ప కవితాత్మ ప్రతిఫలించేలా అనువదించారు. తర్వాతి కాలంలో 'యశోద గీతాలు' వంటి ఆధ్యాత్మిక, మార్మిక కవిత్వ రచనలూ చేసారు. పడవ ప్రయాణం కథతో తెలుగు కథకు అంతర్జాతీయ కీర్తిని ఆర్జించిన పాలగుమ్మి పద్మరాజు కవిత్వం ఆరోజుల్లోనే గ్రంథ రూపంలో వచ్చింది. అన్వేషిస్తే ఇలాంటి రచయితలు మరికొందరు బయటపడతారు. ఇదంతా ఎందుకంటే మౌళికంగా కవి అయిన వాడు, ఉదాత్త భావుకత్వం ఉన్నవాడు రాసిన రచనలో కవితాత్మక వచనం అప్రయత్నంగా వచ్చి కూచుంటుంది అని చెప్పడానికే!

చలం కవిత్వానికి వజీర్ రహ్మాన్ చేసిన ఉపకారం లాంటిదే రావిశాస్త్రి కవిత్వానికి త్రిపురనేని శ్రీనివాస్ చేసాడు. తన కవిత్వం ప్రచురణలు పరంపరలో 10వ పుస్తకంగా రావిశాస్త్రి కవిత్వం - ఎన్నెలో ఎన్నెల పేరుతో 1991 జనవరిలో పుస్తకంగా తెచ్చాడు. ఈ ప్రసంగ పాఠానికి ఎన్నెలో ఎన్నెల, తెలుగు వచన శైలి గ్రంథాలు ప్రధాన ఆకారాలు.

అయితే చలం లాగే రావిశాస్త్రి కూడా తాను కవిత్వం రాద్దామని ప్రయత్నించి విఫలమైనట్టు ఒక ఇంటర్వ్యూలో చెప్పుకున్నాడు. "I am a failed poet. మొదట నాకు పోయిట్రీ రాద్దామనే సరదా ఉండేది గానీ రాయలేకపోయాను. చిన్నప్పుడు సంస్కృతం నేర్చుకున్నాను. దానితో తెలుగు రాలేదు. సంస్కృతం కూడా రాలేదు. తెలుగులో బాగా ప్రవేశం లేకపోవడం చేత కవిత్వం రాయలేక పోయాను" (16-3-1988, ఉదయం దిన పత్రిక, ధ్వని పేజీ) అయితే ఎన్నెలో ఎన్నెల సంపాదకుడు త్రిపురనేని శ్రీనివాస్ తన ముందుమాటలో "అప్పట్లో వచనం పేరుతో రావిశాస్త్రి రాసింది ఈ నాటి అత్యాధునిక కవిత్వంలో పోటీపడ గలుగుతోంది అంటే ముప్ఫై నలభై ఏళ్ళ క్రితమే ఆయన సాధించినదేమిటో అర్థం అవుతుంది.' అని రాసిన మాటలో నూటికి నూరు శాతం నిజం.

కవులు రచయితలకు చాలామందికి నోట్సు రాసుకునే అలవాటు ఉంటుంది. సద్యోస్ఫూర్తిగా అప్పటికప్పుడు స్ఫురించిన ఒక వాక్యాన్నో, కవితా శకలాన్నో వెంటనే కాగితంమీద నోట్ చేసుకుంటారు. మన వాక్యమే కదా, తర్వాత గుర్తు చేసుకుందామంటే ఎంత తల బద్దలుకొట్టుకున్నా గుర్తుకు రాదు. అందుకే మా మాస్టారు అత్తలూరి నరసింహారావు వాక్యం పలికితే భార్య పక్కలో పడుకున్నా, వెంటనే లేచి రాసిపెట్టుకోవాలి, లేకపోతే పొద్దున ఎంత తన్నుకు వచ్చినా గుర్తుకు రాదు" అని తనదైన ధోరణిలో చెప్పేవారు. ఇలాంటి అనుభవం ప్రతీ కవీ, రచయితా ఏదో ఒక సందర్భంలో ఎదుర్కొనే ఉంటారు. రావిశాస్త్రి అలా నోట్సులు రాసిపెట్టుకోవడం వల్ల ఆయన సాహిత్యంపై వచ్చిన విమర్శలకు సమాధానాలు నోట్సుల్లో ఉన్నాయని యు.ఎం. నరసింహమూర్తి పేర్కొన్నారు.

రావిశాస్త్రి కవితాత్మక శైలిని పరామర్శించే ముందు విమర్శకులు ఆయన రచనా విధానంపై చేసిన విమర్శలకు ఆయన నోట్సుల రూపంలో ఇచ్చుకున్న వివరణలను చూద్దాం.

రావిశాస్త్రి కథలు రాసేటపుడు శిల్పంగురించి అవసరం కంటే ఎక్కువ శ్రద్ధతీసుకుంటారని ఒక విమర్శ. దానికి శాస్త్రి "వాస్తవానికి నేను కథగా చెప్పే ఇతివృత్తం ఏ విధంగా చెప్తే బాగుంటుందోనని కొంచెం ఆలోచిస్తాను. కానీ దాని గురించి తన్నుకు చావను. ఆ విధానం తెలిస్తే ఆ కథ సరిగా వస్తుంది."

అలాగే దృక్పథంగురించి చక్కగా చెప్పటం ఒక్కటే ప్రధానం కాదు. చక్కగా నువ్వేం చెబుతున్నావు అనేది ముఖ్యం. రచయితకు దృక్పథం ముఖ్యం అని కుండ బద్దలు కొట్టినట్టు చెప్పారు.

అలాగే ఆయనకు విని నేర్చుకోవడం ఇష్టం ఆయన రాసుకున్న నోట్సులో చిట్టి పంతులు మాటలుగా రాసి పెట్టుకున్న "నువ్వు చదువుకి సముద్రానివి, అనుభవానికి కాల్వవి. నేను చదువుకి కాల్వను. అనుభవానికి సముద్రాన్ని" వంటి జీవితానుభవపు మాటల్ని ఆయన లోకం వినికిడి నుంచి గ్రహించినట్టే భావించ వచ్చు. "ప్రాథమిక రచనలలో శైలీ స్పృహ లేదు. అల్పజీవితో పేరు వచ్చిన దగ్గరనుండి శైలీ స్పృహ వచ్చింది అని ఒకచోట రాసుకున్నారు. రావిశాస్త్రి శైలిలో కొంత చైతన్య ప్రవంతి, అధివాస్తవిక శైలులు ఉన్నట్టు విమర్శకులు గుర్తించారు. ఒక రచయిత రచనా విధానం మీద శిల్పం మీదా అతను చేసే వృత్తి, ఆ వృత్తిలో ఎదురయిన మనుషులు, వారి భాష, యాస, కట్టూ బొట్టూ, ప్రవర్తన వంటి విషయాలు ఎంతటి ప్రభావాన్ని చూపిస్తాయో రావిశాస్త్రి జీవితమే ఒక ఉదాహరణ. సంపన్న బ్రాహ్మణ వర్గంలో పుట్టిన విద్యావంతుడు, న్యాయవాది అయిన ఒక రచయితకు అట్టడుగు పొరల్లో జీవిస్తున్న అలగా జనం (నా మాట కాదు) భాష ఎలా వంటబట్టిందో ఆయన మాటల్లోనే వినండి. "న్యాయవాద వృత్తిలో నా దగ్గరకు వచ్చే బీదప్రజలతో సాన్నిహిత్యం వల్ల వారి ప్రవర్తన, భాష బాగా పరిశీలించి నాకంటూ ఒక శైలిని ఏర్పరచుకున్నాను. అది విశాఖ మాండలికం అనుకోండి, ఉత్తరాంధ్ర భాష అనుకోండి, మరోటనుకోండి" ఇది రావిశాస్త్రి రచనా శైలికి ఉన్న నేపథ్యం అందుకే ఆయన తన క్లయింట్స్‌కు అభిమాన పూర్వకమైన 'ఛాత్రిబాబు' అయ్యారు. ఆయన రచనల్లో సజీవ పాత్రలై మిగిలిపోయారు. ఈ మొత్తం వ్యవహారం, కేవలం ఆయన రచనా శైలిమీదనే కాక, కవిత్వ శైలిని కూడా ప్రభావితం చేసాయనడానికి, ఆయా పాత్రల వర్ణనలు మనకు సాక్షంగా నిలుస్తాయి. రావిశాస్త్రి రచనల్లో కవితాత్మక శైలి గురించి మాట్లాడుకునే ముందు శైలి గురించి ఒకటి రెండు మాటలు. శైలి శీల సంబంధమైనదని ప్రాచీన అలంకారికులు భావించారు. శీలం శబ్దంనుండి శైలి ఏర్పడిందని ఒక భావన. 'శీలస్వభావః శీలస్యకర్మశైలి' అని సంస్కృత నిఘంటువులు. సాహిత్యంలో రసము, తులనాత్మక అధ్యయనం వంటి మౌలిక భావనలు ముందుగా ఆయుర్వేదం, సైథాలజీ అండ్ రిలిజియన్ వంటి సాహిత్యేతర శాస్త్రాలలో ప్రచారం పొందాక సాహిత్యంలో ప్రవేశించాయి.

శైలి భారతీయ అలంకార శాస్త్రంలో 'రీతి' వంటి వాటికి దగ్గరగా ఉన్నా ఆధునిక యుగంలో అది భాషా శాస్త్రంలోనే ముందుగా stylistics పేరుతో ప్రధాన అంశంగా వృద్ధి చెందింది. ఆ తరువాతే అది సాహిత్య విమర్శలో 'శైలి'గా స్థానం సంపాదించుకొంది. అయితే శైలి గురించి తెలుగులో విశేష కృషి చేసిన చేకూరి రామారావు, పరిమి రామ నరసింహం వంటివారు వెలువరించిన గ్రంథాలు భాషాశాస్త్ర నేపథ్యంలో వెలువడినవే అని గమనించాలి. తెలుగులో సాహిత్యంలో ఆ లోటును చాలావరకు తీరుస్తూ వచ్చిన బృహద్గ్రంథం డా॥ యు.ఎ.నరసింహమూర్తి తెలుగు వచన శైలి గ్రంథం. తెలుగు శైలికి సమానార్థకంగా ఇంగ్లీషులో style అనే పదం విస్తృతంగా వాడుకలో వుంది. Katie wales అనే శైలీశాస్త్ర నిఘంటుకారుడు తన "A dictionary of stylistics" అనే గ్రంథంలో ఒక వ్యక్తి ఆచరించే చర్య, సన్నివేశం, సంభాషణలు, వాచకం, మొదలైన ఏడు పద్ధతులలో రచయితకు శైలి ఏర్పడుతుందని చెప్పాడు. ఇవి సాధారణ శైలితోపాటు కవితాత్మక శైలికి కూడా దోహదం చేస్తాయని రావిశాస్త్రి రచనానుభవం మనకు చెబుతుంది. "ఒక శిల్పానికి జీవాన్ని తెచ్చేది ఆ శిల్ప పనితనం. అతని చేతిలోని మార్దవం తాను చెప్పినట్టుగా రాయి తన మాట వినడం, తాను తలచిన రీతికి రాయి ఒదగడం. మహా శిల్పిచే నిర్వహించబడిన కావ్యం కూడా అంతే. ఆ కవి పనితనం ఎక్కడో గోచరిస్తే అక్కడ శిల్పం ఉన్నదని మనం అనుకోవాలి" అంటారు వడలి మందేశ్వరరావు. "వస్తువును వ్యక్తీకరించే విధానం శిల్పం. అని నందిని సిధా రెడ్డి అభిప్రాయం. చలం తన రచనల వస్తువును వదిలేసి శైలిని మెచ్చుకున్న సందర్భంలో" వాళ్ళు శైలి అనుకునేది నా హృదయోద్రేకం అన్నారు. మామూలు శైలితో పాటు కవితాత్మక శైలికి ఈ హృదయోద్రేకం అవసరం అని రావిశాస్త్రి కవితా వాక్యాలు చెప్తాయి. ఈ కవితాత్మకత పాత్రల అంతరంగపు ఉద్వేగాల ద్వారా, పువ్వులు, వెన్నెల, రాత్రి వంటి ప్రకృతిని వర్ణించే విధానంలోనూ, పాత్రలు పడే సంఘర్షణ ద్వారా ఇలా అనేక రకాలుగా కనిపిస్తుంది. మూడు కథల బంగారం' నవలలో తెల్లచీర కట్టుకుని వెన్నెలలో నిలుచున్న వియత్నాం విమలను చూసినప్పుడు బంగారయ్యలో కలిగిన భావావేశం చూడండి.

"చంద్రుడు, నీలాల చెరువులో బంగారు పడవలా వెలుగుతున్నాడు / చుక్కలు, ఎండవేళ నీట్లో తేలే తెల్ల గులాబీల్లా మెరుస్తున్నాయి. గాలి / వేసవి కాలంలో మంచినీటి చెంబుకి చెంప ఆన్చుకుంటే హాయి అన్పించినట్టు హాయిగా తగుల్తోంది" ఇలా ప్రకృతిని తనదైన శైలిలో వర్ణిస్తూ ఆ వెన్నెల రాత్రి విమల చూస్తున్న అనుభూతిని గాలి ఎక్కడెక్కడ నించో తెచ్చే గంధం/ విమలనించి వీచే గంధం/ నాలోంచి ఎగసేగంధం/గంధం గంధం/ గంధాల గంధపు వాసనలతో నేను వేడెక్కి పోతున్నాను, మత్తెక్కిపోతున్నాను. ఇలా చివరివాక్యాల దగ్గరకు వచ్చేసరికి బంగారయ్య పొందిన భావోద్వేగం పాఠకునికి అనుభూతమౌతుంది. కవితాత్మకశైలి ప్రయోజనం ఇదీ!

ఇదే కథలో విమల మామూలు దుస్తులు విడిచి నర్సు దుస్తులు మార్చుకుంటున్నపుడు ఆమెను అర్ధనగ్నంగా చూసిన బంగారయ్య ఫక్తు భావకవిలా మారిపోయి ఆమె అందాన్ని" ఆహా! అందరూ.... నువ్వు శరత్కాలపు చల్లచల్లని పూర్ణ చంద్రుని రేఖవే! నువ్వు మాఘ మాసపు ఉదయకాలపు సూర్య కిరణపు శోభవే! నువ్వు వేయి రాత్రుల నీలివెన్నెల మంచుసోనల జల్లువే అందమా! అందమా! నువ్వు చీకటికి కాంతినిచ్చే కంటి కాటుక రేఖవే! ఇలా సాగుతుంది విమల అందపు వర్ణన. ఇటువంటి చోట్ల ఆ పాత్రలోంచి రచయిత తొంగిచూడ్డం పాఠకుడు గమనించకపోడు.

గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన పిల్లలకు మొక్కలు నాటడం, పెంచడం ఇష్టం. ఈ వ్యాసకర్తకు చిన్నప్పుడు ఈ రోజు పెరట్లో విత్తనాలు నాటి మరుసటి రోజు ఉదయమే లేచి వెళ్ళిచూసి, ఇంకా మొక్కలు రాలేదని నిట్టూర్చిన అనుభవం ఉంది. ఆరు సారో కథలు సంపుటంలోని 'పువ్వులు' కథలో కమల కూడా అటువంటిదే. పదమూడేళ్ళ కమల అంతకు ముందు రోజు సాయంత్రం పెరట్లో బంతి మొక్కలు నాటి మరునాడు పొద్దున్నే వాటిని చూసిన ఆనందం, ఆశ్చర్యాలను రావిశాస్త్రి ఇలా ఒడిసిపట్టుకున్నారు.

"ఇటు ఈ మొక్క దగ్గర నిల్చుంది కమల /అటు ఆ మొక్క దగ్గరకు పరుగెట్టింది కమల/ ఇదే కమల ఈ మొక్క అయింది/ ఇదే కమల ఆ మొక్క అయింది/ నిన్నరాత్రి నీటిమబ్బు ఈ కమలే/ నిన్నరాత్రి వానజల్లూ ఈ కమలే/ ఆ కమలే ఈ ఉదయం సూర్యరశ్మిగా మెరుస్తుంది." అని కమలను తలెత్తి నిలుచున్న బంతి మొక్కలకు అబేధం చెప్పి, ఒక తాదాత్మ్య స్థితిలోకి రచయిత తీసుకెళ్తారు.

మూడు కథల బంగారం నవలలో మెయిల్‌లో తిరుపతి పెళ్ళికి వెళ్తున్న గొప్పింటి అమ్మాయిలను మోసపుచ్చి సజ్జను ఎత్తుకుపోయిన దొంగ బంగారిగాడు సజ్జలో అడుగునున్న బంగారాన్ని చూసి ఆనందంతో ఉబ్బితబ్బిబ్బు అయి అన్న మాటలు..." సజ్జల ఏటుందనుకున్నారు? బంగారం! బంగారం!....సుట్లు సుట్టుకొని పావులు పావులుగావుంది రంగురంగు లతల్లా తీగెలు తీగెలుగా ఉంది. ఆడోళ్ల గుండెల్లాగ్గ బరూబరూగ్గ ఉంది పొదలంట పులికళ్ళు దాగున్నట్టు ఆ బంగారమంతా ఆ సజ్జలో మాటేసుకు కూకుంది." అయి దొందలో ఆరొందలో తులాలుంటే అంతబంగారాన్ని బంగారిగాడు ఎప్పుడూ కంటితో చూడలేదు. అందుగురించి అతనికి బంగారం అనేక విధాలుగా గోచరిస్తుంది. ఇందులో రెండు విషయాలు ఉన్నాయి. ఏదైనా వర్ణన చేసేటప్పుడు స్త్రీని తీసుకురావడం అదికూడా శృంగారపరంగా. రెండు, బంగారి గాడికి సజ్జలో బంగారంపైనే దొరకలేదు. పై సున్నుండలు, ఆకింద తువ్వాలు, తువ్వాలు కింద బంగారం కనబడింది. అందుకే పొదలంట పులికళ్ళు దాగున్నట్టు బంగారం మాటేసింది అనడం సాభిప్రాయ వర్ణన.

బుక్కులు కథల సంపుటిలో తలుపుగొళ్ళెం కథలో పైడిరాజు షావుకారు గదిని చూసినప్పుడు, చిన్నప్పుడు తన ఇంట్లోని ఇరుకుగదితో పోల్చుకున్నప్పుడు రెండుగదుల మధ్య వ్యత్యాసాన్ని కవి ఇలా బొమ్మ కట్టించాడు. "ఓ గదినిండా నీడలే రెండో గదినిండా పాలవెలుగులే ఓగదిలో మూలుగులే రెండో గదిలో నవ్వులే. అందులో మనిషి కష్టం కళ్ళు విప్పుకుని చీకటిగా ఏడుస్తోంది. ఈ గదిలో మనిషి దొంగతనం వెలుగుతోంది... ఆ గదిలో నిర్భాగ్యుల నీడలు. ఈ గదిలో దొంగతనపు రంగులు" కథాభాగం నుండి విడదీసి విడిగా ఈ పంక్తులను చదువుకుంటే మంచి అభ్యుదయ కవిత అనిపిస్తుంది ప్రజల్ని దోచుకున్న షావుకారు గదికి, పేదవాడైన పైడ్రాజు గదికి వ్యత్యాసాన్ని చూపించడానికి రచయిత వాడిన పోలికలు, ప్రతీకలూ ధనవంతుడినీ పేదవాడికీ మధ్య ఉన్న వ్యత్యాసాన్ని చూపుతాయి. ఈ పంక్తుల్లో వచ్చిన "దొంగతనం వెలుగుతోంది" మనిషి చేసే దొంగతనం, దొంగతనపు రంగులు" షావుకారు చేసే దోపిడీని తెలియచెప్పే పదాలు రచయితకు దృక్పథం ముఖ్యం అని నమ్మిన రావిశాస్త్రి ఇలాంటి తావుల్లో తన దృక్పథాన్ని చెప్పకనే చెప్పాడు. 'బాకీ కథలు' సంపుటిలో 'వెన్నెల' కథలో రావిశాస్త్రి వెన్నెలను వర్ణించిన పద్ధతి అపురూపం. చాలా కవితాత్మక రచనల్లో కేవలం వర్ణన మాత్రమే ఉంటే ఈ కథలో చేసిన వెన్నెల వర్ణనతో పాటు శ్రామికుల పోరాటం కూడా సమాంతరంగా నడుస్తుంది. ఈ రచన చదివాక రావిశాస్త్రి కార్మికుల పక్షాన నిలబడిన వర్గ పోరాట రచయితగా కనిపిస్తారు." వెన్నెలా వెన్నెలా నువు చూపే దృశ్యాలకి మనసు చెదురుతుందే వెన్నెలా/ గుండె కరుగుతుందే వెన్నెలా/ యువరక్తం ఉడుకుతుంది వెన్నెలా...

ఇలా వెన్నెలను నేపథ్యంగా చేసుకుని మిల్లు కార్మికుల సమ్మెపై పోలీసులు కురిపించిన తూటాల వర్షాన్ని మన ముందుంచుతాడు.

"అవి అధర్మానివి తుపాకులే/ మిల్లు చుట్టూ మర తుపాకులే/ వాటికెదంగా జన ప్రవాహం" కవిత కొనసాగుతుంది.

"ఏ బాధలూ చూడలేక/ఏ అన్యాయాలనీ సహించలేక/ ఏ అధర్మాన్నీ క్షమించలేక/ ఎదిరించినిల్చిన/ తన కొడుకు ప్రాణపు వేడినెత్తురు ఎక్కడమ్మా వెన్నెలా"

అన్న ప్రశ్నతో వాతావరణం ఆర్ద్రమౌతుంది, బరువెక్కుతుంది, ఎరుపెక్కుతుంది కుందుర్తి వచన కవిత్వంలో కథా కావ్యాలు రావాలని చెప్పిన కాలంలోనే రావిశాస్త్రి కథలో వచన కవిత్వం రాయడం విశేషం. రావిశాస్త్రి కవితాత్మిక రచనలో ఇది పతాక స్థాయి రచన. కిటికీ, విలువలు, జరీ అంచు తెల్లచీర వంటి కథల్లో సుదీర్ఘ కవితాత్మక రచనలు ఉన్నాయి.

కేవలం వర్ణనలతో కవితాత్మక వచనం రాయడమే కాకుండా నిర్మాణపరంగా రావిశాస్త్రి వచనంలో కవితాత్మకమైన లక్షణాలు గమనించవచ్చు. 'విలువలు' అనే కథలో ఒక వాక్యం "కలుసుకున్నా నావిణ్ణి మలుపులో" అని క్రియాపదంతో ప్రారంభమవుతుంది. ఇది పద్యరచనా లక్షణం తిక్కన ఒకచోట వచ్చినవాడు ఫల్గుణుడు' అని క్రియాపదంలో మొదలుపెడతాడు. ఆధునిక వచన కవిత్వానికి మేనిఫెస్టో అనదగిన తిలక్ అమృతం కురిసిన రాత్రిలో ఆర్తగీతం' ఖండికలో అనేక పంక్తులు నిజంగా చూసాన్నేను...." అనే క్రియావాచకంతో మొదలవడం అందరికీ తెలిసిందే. రావిశాస్త్రికి తన వృత్తికి ఆధారమైన కోర్టు ఒక పెద్దబాలశిక్ష అయితే, కోర్టు కేసుల్లో ఇరుక్కున్న క్లైంట్‌లు తనకు సృజన పాఠాలు చెప్పిన గురువులు. చాలా కథల్లో కోర్టు ప్రస్తావనలు, వాతావరణం కనిపిస్తాయి. ఆరు సారా కథలులో న్యాయ కథలో ప్రారంభ వాక్యాలు చూడండి" గుప్పున సారా కంపు - కోర్టు గొల్లున సంతలో కోర్టు. అబద్దాలకి పాముల పుట్ట కోర్టు బందిలదొడ్డికి రాచబాట కోర్టు" ఇదీ కోర్టుల గురించి లాయర్ అయిన రావిశాస్త్రి అభిప్రాయం. అది కేవలం అభిప్రాయం మాత్రమే కాదు అనుభవం. ఈ వాక్యాలకింద బ్రాకెట్లలో రచయిత రాసిన ఈ వాక్యాలు కూడా అవధరించండి! (అక్కడ అనాథుల ఆక్రందన, అక్కడ అసహాయుల ఆర్తనాదం. అక్కడ పేదల కన్నీటిజాలు. అదేసుమా కోర్టు! అని కూడా నాకు రాయాలని ఉంది. అయితే, సెంటిమెంట్ సాబ్ స్టఫ్, ఏడుపురాత రాసేనని తప్పక చాలామంది వెక్కిరిస్తారు). మన నాటకాలలో ప్రకాశముగా అనీ అనీ సంభాషణలో ఉంటాయి. ఇదీ అలాంటిదే-

భారత సుప్రీం కోర్టు న్యాయ మూర్తిగా ఎన్.వి. రమణగారు ఎంపికయిన సందర్భంగా సామాజిక మాధ్యమాల్లోనూ, పత్రికల్లోనూ ఆయన రావిశాస్త్రి కథలనుండి కోర్టు తీర్పులను ఉటంకించిన సందర్భాలు నాతోపాటు కొందరైనా చూసే వుంటారు.

రావిశాస్త్రి ఈ కవితాత్మక శైలికి ఆయన ఉపయోగించిన similis పోలికలు ఎక్కువగా దోహదం చేసాయని రావిశాస్త్రి మిత్రుడు, ప్రముఖ భాషాశాస్త్ర వేత్త ఒక వ్యాసంలో సవివరంగా వివరించారు. మూర్త విషయాలను మూర్త విషయాలతో పోల్చడం, అమూర్త విషయాలను మూర్త విషయాలతో పోల్చడం ద్వారా రావిశాస్త్రి ఇవి సాధించాడన్నారు.

'రత్తాలు రాంబాబు' నవలలో వేశ్యగృహంలో తన స్నేహితురాలు ముత్యాలు ఏడు నిలువుల లోతు నూతిలో ఆత్మహత్య చేసుకున్నప్పుడు, రత్తాలు పడ్డ మానసిక వేదన, ఆరు చిత్రాల 'కథాసంపుటిలో' మామిడిచెట్టు కథలో తను అద్దెకు దిగిన ఇంటి పెరడులోని మామిడి చెట్టు పక్క ఇంటి వారికి నీడనిస్తుందన్న అక్కసుతో మామిడిచెట్టును కొట్టి వేయించిన ఇంటి యజమాని చర్యతో నీడకోసం పలవరించిన నాయకుడి మాటల్లో మనల్ని కవిత్వం పలకరిస్తుంది ఇలా తవ్వుకుంటూ పోతే ఇదో పెద్ద పరిశోధనా గ్రంథం అవుతుంది - వీటిని ఇక్కడ ఆపి -విశాఖ రచయితల సంఘం కార్యదర్శిగా, విరసం సభ్యుడుగా ఉంటూ ఎన్నో కథలు రాసి 'ఎన్నెస్' కథలు పేరున కథా సంపుటి వెలువరించిన ఎన్నెస్ ప్రకాశరావు ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాదంలో అసువులు బాసినప్పుడు రావిశాస్త్రి రాసిన స్మృతి కవిత 'ఎన్నెస్ ప్రకాశరావు'. కవితలోని కొన్ని పంక్తులు "నువ్వు లేవు నవ్వులు చిందేవ్ నువ్వు లేవు. పువ్వులు అందించావ్ కథలెన్నో పండించేవ్ కలలెన్నో సృష్టించావ్. పావురాల వీధిలో డేగలు, కోయిలమ్మ గూటిలో పాములు ఉంటాయని మాకు చెప్పాక నీ మనోధైర్యం నీ గుండె నిబ్బరం మాకాధర్మం ఎన్నెస్ ప్రకాశరాయ!" అంటూ ఎన్నెస్ ఆదర్శాలను గద్గద కంఠంలో గానం చేస్తాడు.

ఇవన్నీ కథలోనో, కవితలోనో అంతర్భాగంగా ఆయా సన్నివేశాల్ని అంతరంగ మధనాల్ని ఆవిష్కరించడానికి చేసిన వర్ణనలు.ఇవి ఆయా రచనల్లో వచనంలో అంతర్భాగంగా పేరాగ్రాఫ్ లాగే ఇమిడివున్నాయని మనం గ్రహించాలి. వాక్యం మీద వాక్యంలా కాకుండా, పాదం పక్కన పాదం రాసే వాటిని ఇంగ్లీషులో prose poems అంటారు. తెలుగులో కవితాత్మక వచనం అంటారు. గతంలో ఆరుద్ర, తర్వాత వేగుంట మోహన ప్రసాద్ ఈ రచనలో కృషిచేసారు - కవిత్వం కవిత్వంగా రాసినా వచన రచనలో మధ్యలో చెప్పినా "Always be a poet - Even in prose" అని చార్లెస్ బొదిలేర్ అన్నట్లుగా వచనంలోనూ కవిత్వమై పలవరిద్దాం.

గ్రంథ సమీక్ష

చదవదగిన 'గుర్తుకొస్తున్నాయి'

టి.వి.ఎస్.

టి.వెంకట్రావు చాలామంది పరిచయస్తులకు మంచి కార్టూనిస్ట్‌గా తెలుసు. సాదా, సీదాగా కనిపిస్తూ సుతిమెత్తగా మాట్లాడే టివి 'గుర్తుకొస్తున్నాయి' పుస్తకం నేటి తరంలో వివిధ



రంగాలలో నిపుణులైన వారు తమను తాము పరిచయం చేసుకోవలసిన అవసరాన్ని గుర్తు చేస్తుంది. శాంత స్వభావుడైన టివిగారికి సామాజిక విప్లవ భావాలున్నాయా? అన్న సందేహమూ అప్పుడప్పుడూ మాట్లాడే వాళ్లకు సహజంగా అనిపిస్తుంది. తనను తాను పరిచయం చేసుకోవడం ఎక్కడా అతిశయోక్తులు కనిపించవు. కమ్యూనిస్టు కార్యకర్తలు ఎలా ఉంటారో, ఎలా ఉండాలో ఇందులో వివరించిన అంశాలు నేటి తరానికి ఆచరణీయమైనవి. జీవిత భాగస్వామి అరుణగారితో సహా సిపిఐ చీలక అనంతరం సాయుధ పోరాటంలో పనిచేయటం, అనివార్య పరిస్థితుల్లో బయటికి రావటం, జైలు జీవితం అంశాలు సైతం తెలుసుకోదగినవి. నేను 1976 లో విశాలాంధ్ర పత్రికలో ఉప సంపాదకుడిగా శిక్షణ పొందుతున్న సమయంలో రచయిత కె.రాజేశ్వరరావు, ప్రసిద్ధ చిత్రకారుడు మోహన్‌లతో పాటు నాకు టి.వి పరిచయమయ్యారు. విశాలాంధ్రకు కేవలం కార్టూనిస్టుగా పని చేస్తున్నారని భావించాను. అయితే నాకు వార్తల అనువాదంలో అక్షరాలు దిద్దించిన మోహన్, టి.వి నక్సల్స్ ఉద్యమంలో పనిచేసి వచ్చారని, కొండకోనల్లో ఉండే సమయంలో సవరల జీవితాలను అధ్యయనం చేసి, వారి భాషను సైతం నేర్చుకున్నారని చెప్పినప్పుడు గట్టివాడేనని అర్థమైంది. సవరలు, జాతాపుల జీవన విధానాన్ని ప్రజలకు తెలియజేయడానికి వ్యాసాలు రాయడాన్ని జైలు జీవితాన్ని వినియోగించుకోవడమూ ప్రత్యేకతే. విద్యార్థిగా, విద్య ముగిసిన తర్వాత జీవించిన విధానం నేటి విద్యార్థులు తెలుసుకోవలసిన విషయం. నాస్తికుడిగా పత్రికా ప్రకటన చేసి జ్యోతిష్యులకు 1996 లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై పోటీ పెట్టి వారి అంచనాలన్నీ తప్పని నిరూపించిన ఘనత టివిదే. జ్యోతిష్యులు చెప్తున్న అంశాలు ఎలా నిజం కాదోనని నిరూపించిన సంఘటన ఇది. నేటి కేంద్ర పాలకుల మూఢ నమ్మకాలను పెంచి పోషించేందుకు జ్యోతిష్యం పాఠ్యాంశాలలో చేర్చడానికి పూనుకున్న దశలో ఈ సంఘటన కనువిప్పు కలిగించాలి. శ్రీశ్రీ లాంటి గొప్ప రచయితలతో పరిచయాలు, తన జీవితంలో జరిగిన సంఘటనలు, వృత్తి జీవితం, 70 ఏళ్ల తర్వాత ప్రశాంత జీవనం ప్రణాళిక, కేన్సర్‌ను జయించిన విధానం తదితర అనేక అంశాలను తెలుసుకొనేందుకు 'గుర్తుకొస్తున్నాయి' ని తప్పక చదవవలసిన పుస్తకం.

అమెరికాలో ఒక గ్రంథాలయంలో టివి కార్టూన్ల పుస్తకం ఉండటం భారతదేశ కార్టూనిస్టులకు దక్కిన గౌరవంగా భావించాలి. తనకు అపార పరిజ్ఞానం ఉన్న విద్యను నలుగురికి పంచాలన్న తపన ఆయన జరిపిన శిక్షణా శిబిరాలు, ఆయన వేసిన కార్టూన్ల పుస్తకాలు, ఇతర రచనలు మనకు తెలియజేస్తాయి. అలాగే విప్లవకారుల జీవితాలను టివి రచనలు కొంత పరిచయం చేస్తాయి. ఆయన జీవితమంతా పాటించిన క్రమశిక్షణ ఆదర్శనీయం. కమ్యూనిస్టు పార్టీ అగ్రనేతలతో గల సన్నిహిత పరిచయాలు, పార్టీ నిషేధ సమయంలో రహస్యంగా తిరిగిన అనుభవాలు తెలుసుకోదగినవి.

మనం 'లో' మనం

- ఏటుకూరి ప్రసాద్

ఇలా ఎలా భళాభాయి పోరాడే శక్తులూ
అరుణ పతాకాలన్నీ తలోదారినెళ్తొంటే ॥ఇలా॥

జనం నుంచి జనంలోకి
జనం నుంచి వనంలోకి
వనం నుంచి అహంలోకి
అహం నుంచి అహాల్లోకీ
అహాల నుంచి నైరాశ్యంలోకీ
నైరాశ్యం నుంచి గాఢ శూన్యంలోకీ ॥ఇలా॥

అరుణ పతాకాలన్నీ తలో దారినెళ్తుంటే -
ఇలా ఎలా భళాభాయి పోరాడే శక్తులూ?! ॥ఇలా॥

అహాల దడులన్ని నేల కూల్చుకోలేమా?!
జనాల ఊసెరిగి దారి మార్చుకోలేమా?!
దోపిడిమూకల ముంగిట నవ్వులపాలౌదామా?! ॥ఇలా॥

వేరువేరు పేర్లు చెరిపి పోరు సల్పలేమా?!
తలోదారి వాళ్ళమొకే దారినెళ్ళలేమా?!
దారి తప్పినోళ్ళంగా చరితరాసుకుందామా॥ఇలా॥

అరుపుల వాండ్లన్న పాడుపేరు తెచ్చుకుందామా?!
ఘనచరిత్ర చెరిపేస్తూ హీనులమవుదామా?!
పోరాటాల్కాగడాలమొక్కటవ్వలేమా?!
పేదల బతుకుల ఆశల వెలుగు నింపలేమా?!॥ఇలా॥

నిప్పరవ్వలేదున్నా ఒడిసిపట్టలేమా?!
లౌకిక శక్తులనన్నీ కలిపి కదపలేమా?
చరిత్రనేడుంచిన ఈ బరువు మోయలేమా?!
పాలక మతదుండగాలు రూపుమాపలేమా?!॥ఇలా॥

అహం వొదిలి మనం జనం మనసు గెల్వలేమా?!
అందరమొకటై చరిత్ర తిరిగిరాయలేమా?!
మెదళ్ళ పొరలన్ని దులిపి ఆలోచించండి!
ఇలా ఎలా భళాభాయి పోరాడే శక్తులూ
అరుణ పతాకాలన్నీ తలో దారి వెళ్తుంటే
ఇలా ఎలా భళాభాయి...

కోపూరి శ్రీనివాస్ స్మారక సింగిల్‌పేజీ కథల పోటీ ఫలితాలు

ఇటీవల 'రమ్యభారతి' పత్రిక ఆధ్వర్యంలో కోపూరి శ్రీనివాస్ స్మారకార్థం నిర్వహించిన సింగిల్ పేజీ కథల పోటీలకు జాతీయస్థాయిలో 131 కథలు వచ్చాయి. వాటిలో న్యాయనిర్ణేతల నిర్ణయం మేరకు మరీదు వేణు, ఖమ్మం రాసిన 'ఒక రిప్‌తో సరి'కు ప్రథమ బహుమతి లభించింది. జి.రంగబాబు, అనకాపల్లి రచించిన 'అసలైన పూజ' కథకు ద్వితీయ, పాణ్యం దత్తశర్మ, హైదరాబాద్ రచించిన 'నేను వస్తలేను' కథకు తృతీయ బహుమతి లభించాయి. అలాగే వురిమళ్ళ సునంద (ఖమ్మం), ఆర్.ఎస్. వెంకటేశ్వరన్ (ఉత్తరప్రదేశ్), ఎం.వి.ఎస్. రామశేషు (గుంటూరు), శైలజామిత్ర (హైదరాబాద్), తులసి బాలకృష్ణ (హైదరాబాద్), బి.వి.శివప్రసాద్ (విజయవాడ), దొండపాటి కృష్ణ (హైదరాబాద్), గంటి రాజేశ్వరి (గుంటూరు), కె.వి.లక్ష్మణరావు (మానేపల్లి), వియోగి (కర్నూలు) రాసిన కథలు ప్రోత్సాహక బహుమతులకు ఎన్నికైనాయి. విజేతలకు నగదు, ప్రశంసాపత్రాలతో ఆగస్ట్ 7 ఉదయం విజయవాడలో జరిగే ప్రత్యేక సభలో బహుమతీ ప్రదానం జరుగుతుంది.

- చలపాక ప్రకాష్, ఎడిటర్, రమ్యభారతి

'గీతాంజలి' పాటల పుస్తకావిష్కరణ

ఆగస్టు 7, ఆదివారం 'రవీంద్రనాథ్ ఠాగూర్ వర్ధంతి' నాడు పార్వతీపురం గిరిజన భవన్‌లో ఉదయం 10 గంటలకు ఠాగూర్ గీతాంజలికి స్వేచ్ఛానువాదం చేసిన గంటేడ గౌరునాయుడు 'గీతాంజలి పాటలు' పుస్తక ఆవిష్కరణ జరగనుంది. స్నేహకళా సాహితి, పార్వతీపురం నిర్వహిస్తున్న ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమానికి కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు గ్రహీత బెలగాం భీమేశ్వరరావు అధ్యక్షత వహిస్తారు. ఈ సభలో ప్రచురణకర్త ఎస్.కె.పబ్లికేషన్, విజయనగరం అధినేత ఎస్.కె.బాబు, కేంద్ర సాహిత్య అకాడెమీ సలహాసంఘసభ్యులు అట్టాడ అప్పల్నాయుడు, మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ పార్వతీపురం బెలగాం జయప్రకాష్ నారాయణలు, చీకటి దివాకర్, పాయల మురళీకృష్ణ, పలువురు సాహితీవేత్తలూ పాల్గొంటారు.

జగదీశ్ మల్లిపురం, అధ్యక్షులు, స్నేహకళాసాహితి, పార్వతీపురం

సమస్యల వలయంలో మహిళా లోకో డ్రైవర్లు

- మరుగుదొడ్లు లేని రైళ్లు... విశ్రాంతి గదులలేమి
- నీరు తాగడం మానేస్తున్న వైనం - గంటల తరబడి నరకయాతన
- స్టేషన్లలో సైతం కొరవడిన కనీస సౌకర్యాలు - పట్టించుకోని అధికారులు

న్యూఢిల్లీ: మహిళా సాధికారతకు పట్టం కడతామనే పాలకులు వారి సమస్యలపై ఏమాత్రం పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. మహిళలు బస్సుల నుంచి రైళ్లు, విమానాల వరకు నడుపుతున్నారు. భారమైన పనులను కూడా సునాయాసంగా అధిగమించేస్తున్నారు. అయితే వారికి అందాల్సిన కనీస సౌకర్యాలు మృగ్యమయ్యాయి. రైళ్లను పరుగులు పెట్టిస్తున్న ఈ మహిళా రైడర్లు చెప్పనలవని సమస్యలతో సతమవుతున్నారు. కొందరు శానిటరీ న్యాప్‌కిన్‌లను ఉపయోగిస్తారు. మరికొందరు నీరు తీసుకోవడం తగ్గించుకుంటారు. కేవలం 97 రైలు ఇంజిన్లలో మాత్రమే మరుగుదొడ్డి సౌకర్యాలు ఏర్పాటు చేయడంతో మహిళా లోకో డ్రైవర్లు తమ ఆవేదనను చెప్పలేని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. సౌకర్యాల లేమి వారి పురుష సహచరులకు కూడా స్పష్టంగా ఒక సమస్య అయినప్పటికీ, మహిళా డ్రైవర్లు విధి నిర్వహణలో అదనపు సమస్యలను ఎదుర్కొంటున్నారు. రైలు ఇంజిన్‌లో మరుగుదొడ్డి లేకపోవడంతో ఎక్కువ గంటలు ఇబ్బంది పడకుండా సెలవుపై వెళ్లడానికి ఇష్టపడతారు. 'మరుగుదొడ్లు లేని సమస్య పురుషులు, మహిళలు ఇద్దరిలో సాధారణం. అయితే, ఒక మహిళా ఉద్యోగిగా నా పీరియడ్స్‌లో ప్రతిసారీ, నేను సెలవు తీసుకోవాల్సి రావడం నాకు చాలా అవమానంగా అనిపిస్తోంది' అని తక్కువ దూర గూడ్స్ రైళ్లను నడిపే అసిస్టెంట్ లోకో పైలట్ చెప్పారు. ఇతర రోజుల్లో బాత్రూమ్ విరామం లేకుండా రైలు నడపడం బాధాకరమని అన్నారు. బయో మరుగుదొడ్లతో కూడిన మొదటి ఇంజన్‌ను అప్పటి రైల్వే మంత్రి సురేశ్ ప్రభు జెండా ఊపి ప్రారంభించిన ఆరేళ్ల తర్వాత, ఇప్పటివరకు కేవలం 97 మాత్రమే అమర్చినట్లు అధికారులు తెలిపారు. భారతీయ రైల్వేలో ఉన్న 60 వేల కంటే ఎక్కువ లోకో పైలట్‌లలో దాదాపు 1,000 మంది మహిళలు ఉన్నారు. వీరిలో ఎక్కువ మంది స్వల్ప దూర గూడ్స్ రైళ్లను నడుపుతున్నారు. రైల్వేలు మహిళా డ్రైవర్లకు 200 కి.మీ నుంచి 300 కి.మీల చిన్న దూరాన్ని మాత్రమే కేటాయిస్తున్నాయి. అది కూడా వారి ఆమోదంతో, కానీ షిఫ్టులు తరచుగా 12 గంటల వరకు పొడిగించవచ్చు. 'ఇందులో యార్డ్‌లో వేచి ఉండడం, ప్రయాణానికి సిద్ధపడడం, వాస్తవానికి గూడ్స్ రైలును గంటకు 40 కి.మీ వేగంతో ఐదు నుంచి ఏడు గంటల మధ్య ఎక్కడైనా నడపడం వంటివి ఉంటాయి. వీటిలో ఎక్కడా మహిళలకు సౌకర్యాలు లేవు. నాకు ఇబ్బంది వచ్చినప్పుడు శానిటరీ న్యాప్‌కిన్ ధరిస్తాను' అని మరో మహిళా లోకో పైలట్ తెలిపారు. గూడ్స్ రైళ్లలో మరుగుదొడ్డి సౌకర్యం లేదని ఆమె సహోద్యోగి వివరించారు. కానీ ప్యాసింజర్ రైళ్ల పరిస్థితి కూడా అధ్వానంగా ఉంది. ఎందుకంటే వారు దిగడానికి, మరుగుదొడ్డిని ఉపయోగించడానికి మరొక బోగీలోకి ఎక్కడానికి తగినంత సమయం లేదు. ది ఇండియన్ రైల్వే లోకో రన్నింగ్ మెన్స్ ఆర్గనైజేషన్ (ఐఆర్ఎల్ఆర్ఓ) మాజీ అధ్యక్షుడు అలోక్ వర్మ ఈ అంశంపై జాతీయ మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించారు. రైల్వేలు... పురుష, మహిళా లోకో పైలట్ల ప్రాథమిక హక్కులను నిరాకరిస్తున్నాయని ఆయన అన్నారు. దీనిపై రైల్వే శాఖ స్పందిస్తూ, అన్ని లోకో రైళ్లలో మరుగుదొడ్లను ఏర్పాటు చేస్తున్నామని కమిషన్‌కు సమాధానం ఇచ్చింది. లోకో పైలట్ కనీసం 10 నుంచి 12 గంటల డ్రైవింగ్‌లో ఉంటారు. ప్రయాణంలో ఉంటే ఉపశమనం పొందే అవకాశం ఉండదు. వారు భోజనం చేయరు లేదా వాష్‌రూమ్‌కి వెళ్లరు. ఇది అమానుషం' అని వర్మ పీటీఐతో అన్నారు. 'లోకో పైలట్లు, అసిస్టెంట్ లోకో పైలట్‌లుగా నియమితులైన మహిళలు ప్రధానంగా మరుగుదొడ్లు లేకపోవడం వల్ల కార్యాలయాల్లో కూర్చుంటారు లేదా చిన్న ప్రయాణాలకు వెళతారు. వారి దుస్థితిని ఊహించండి' అని అన్నారు. ఆల్ ఇండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ (ఏఐఎల్ఆర్ఎస్ఏ) ప్రధాన కార్యదర్శి ఎం.ఎన్.ప్రసాద్ ప్రకారం, ఇంజిన్లలో మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలనే పోరాటం చాలా కాలంగా ఉంది. ఎక్కువ మంది మహిళలు ఉద్యోగం చేయడంతో ఇది మరింత ప్రాముఖ్యతను పొందుతుంది. మేము ఒత్తిడి చేస్తున్నప్పటికీ, రైల్వేల నుంచి ఏమీ రాలేదు' అని అన్నారు. రిఫ్రెష్‌మెంట్లు తీసుకోవడానికి లేదా బాత్రూమ్ బ్రేక్‌ల కోసం నడుస్తున్న రైలును ఆపడానికి డ్రైవర్లకు అధికారం ఇవ్వడం సాధ్యం కాదని రైల్వేలు చెబుతున్నాయి.

కొంతమంది మహిళలు పరిస్థితి చాలా దారుణంగా ఉందని, చాలా మంది తమ షిఫ్టులలో నీరు తాగడం పూర్తిగా మానేస్తారని చెప్పారు. ఈ కనీస సౌకర్యాల కొరత కూడా తమ ఉద్యోగ భవిష్యత్ అవకాశాలకు ఆటంకం కలిగిస్తోందని వారు తెలిపారు. స్టేషన్లలో కూడా మహిళలకు ప్రత్యేక మరుగుదొడ్డి, విశ్రాంతి గది లేదని చెప్పారు.

ఆ డబ్బు నాది కాదు: పార్థ ఛటర్జీ

కోల్‌కతా: ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సోదాల్లో లభ్యమైన డబ్బు తనది కాదని, తనపై ఎవరు కుట్ర చేస్తున్నారో కాలమే చెబుతుందని పాఠశాల ఉద్యోగాల కుంభకోణంలో అరెస్టయిన పశ్చిమబెంగాల్ మంత్రి పార్థ ఛటర్జీ ఆదివారం పేర్కొన్నారు. వైద్య పరీక్షల నిమిత్తం పార్థను ఈడీ అధికారులు జోకాలోని ఈఎస్ఐ ఆసుపత్రికి తీసుకెళ్లారు. వాహనం దిగి వెళుతున్న సమయంలో ఆయన్ను కలిసిన మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. 'ఈడీ కనుగొన్న డబ్బు నాది కాదు... నన్ను పార్టీ నుంచి సస్పెండ్ చేయడం నిష్పాక్షిక దర్యాప్తును ప్రభావితం చేయగలదు' అని చెప్పారు.

అయితే ఆయను మంత్రివర్గం నుండి తొలగించడంపై మాట్లాడుతూ 'ఆమె (బెనర్జీ) నిర్ణయం సరైనదే'అని అన్నారు. మమతా బెనర్జీకి అత్యంత సన్నిహితునిగా భావించే 69 ఏళ్ల ఛటర్జీని మంత్రి పదవితోపాటు తృణమూల్ కాంగ్రెస్‌లో అన్ని పదవుల నుంచి ఆయనను తొలగించారు.

కోల్‌కతాలో ఛటర్జీ సన్నిహితులలో ఒకరైన అర్పితా ముఖర్జీకి చెందిన నివాసాలలో కోట్లాది రూపాయల నగదు స్వాధీనం చేసుకున్న తర్వాత ఈడీ ఆమెను అరెస్టు చేసింది. పశ్చిమ బెంగాల్ స్కూల్ సర్వీస్ కమిషన్ సిఫారసుల మేరకు ప్రభుత్వ ప్రాయోజిత, ఎయిడెడ్ పాఠశాలల్లోని ఉపాధ్యాయులతోపాటు గ్రూప్-సి, డి సిబ్బంది నియామకాల్లో జరిగిన అవకతవకలపై కలకత్తా హైకోర్టు ఆదేశాల మేరకు సీబీఐ విచారణ జరుపుతోంది.

సుప్రీం సమర్థన ఈడీకి బలం

'మనీలాండరింగ్ ' అధికారాలపై మాజీ డైరెక్టర్ కర్నల్ సింగ్

న్యూఢిల్లీ : మనీలాండరింగ్ కేసుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)కి ఉండే విచారణ, అరెస్టులు, ఆస్తుల జప్తు వంటి అధికారాలను సమర్థిస్తూ.. అరెస్టులు ఏకపక్షం కాదని చెప్పడం; మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ)లోని నిబంధనలను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టివేయడం, బెయిల్ షరతలనూ సమర్థించడం ద్వారా ఈడీకి మరింత బలాన్నిచ్చిందని ఆ సంస్థ మాజీ డైరెక్టర్ కర్నల్ సింగ్ అన్నారు. 1984 బ్యాచ్ ఐపీఎస్, రిటైర్డ్ ఈడీ చీఫ్ (2018) సింగ్ తాజా పరిణామాలపై పీటీఐతో మాట్లాడారు. కేసుల్లో మరింత నిబద్ధతతో పనిచేసేలా దర్యాప్తు అధికారుల్లో జవాబుదారీతనాన్ని సుప్రీం తీర్పు పెంచిందని అన్నారు. ఆస్తులను అటాచ్ చేసేటప్పుడు ఈడీ అధికారి అందుకు సంబంధించి అన్ని ఆధారాలతో ప్రిడికేట్ ఏజెన్సీ (సీబీఐ, పోలీసులు తదితరాల)కి లేఖ రాయాలని చెప్పారు. ఆయా సంస్థలు దానిని పరిగణనలోకి తీసుకొని ఎఫ్ఐఆర్ నమోదు చేసి ఈడీకి సమాచారం ఇస్తాయని, దాంతో విచారణ ముందుకు సాగుతుందని సింగ్ తెలిపారు. ముందుగా నేరం నమోదు కాకపోయినా సోదాలను ఈడీ నిర్వహించవచ్చు అని కోర్టు పేర్కొంది. ఇలాంటి సమయంలో ఇతర ఏజెన్సీలు కేసు నమోదు చేయకపోతే జరిగే పరిణామాల విషయంలో అధికారులు కాస్త జాగ్రత్తగా ఉండాలి.. సరైన సాక్ష్యాధారాలు లేకపోతే నేరం రుజువు కాదు. సుప్రీం తీర్పును గమనిస్తే... ఒక వేళ ప్రిడికేట్ నేరం రుజువు కాకపోతే పీఎంఎల్ఏ నేరం ఉండదు అని చెబుతుంది. కాబట్టి తుది నిర్ణయం బాధ్యత రెండు సంస్థలు (ఈడీ, నేరం నమోదు చేసే సంస్థ)పైనే ఉంటుంది. ప్రిడికేట్ ఏజెన్సీ విజయవంతం అయితేనే ఈడీకి విజయం లభిస్తుంది. లేనిపక్షంలో ఆస్తులు అటాచ్ చేసినా.. విచారణ జరిపినా ఫలితం ఉండదు' అని సింగ్ చెప్పారు. ఈడీ అధికారులకు, కోర్టులకు, న్యాయవాదులకు మనీలాండరింగ్ చట్టంలోని వివిధ సెక్షన్ల గురించి స్పష్టతను ఇచ్చే విధంగా సుప్రీం తీర్పు ఉందని అభిప్రాయపడ్డారు. ఈడీ కన్విక్షన్ (నేరారోపణ) రేటు చాలా తక్కువ అన్న రాజకీయ పార్టీల ఆరోపణను సింగ్ తోసిపుచ్చారు. పార్లమెంటు తాజా డేటా ప్రకారం 2005 నుంచి 23 నేరాలను ఈడీ నిర్ధారించిందని చెప్పారు. 'కన్విక్షన్ రేటు అంటే ఏమిటో ముందు అర్థం చేసుకోవాలి. ఇది కోర్టు ముందరకు వెళ్లే కేసుల సంఖ్యగానీ శిక్ష పడిన కేసుల సంఖ్యగానీ కాదు. ఎన్ని కేసుల్లో న్యాయనిర్ణయం జరిగింది. ఎన్ని కేసుల్లో శిక్షలు పడ్డాయన్నది విభజిస్తే కన్విక్షన్ రేటు వస్తుంది. పార్లమెంటు డేటాలో ఇలాంటి కేసుల సంఖ్య లేదు. నా అనుభవం ప్రకారం కేవలం రెండు, మూడు కేసుల్లోనే దోషులు నిర్దోషులుగా విడుదలయ్యారు. నేరం రుజువు కాని పక్షంలోనే ఇలా జరిగింది. ఇది ఈడీ తప్పు కాదు' అని సింగ్ చెప్పారు. మిగతా సంస్థల కన్విక్షన్ రేటు 40శాతం మేర ఉన్నట్లు తెలిపారు. కన్విక్షన్ రేటు అంటే ఏమిటో తెలియకుండా ఈడీపై ఆరోపణలు తగవన్నారు. దేశంలో విచారణ ప్రక్రియ దీర్ఘకాలం సాగుతుందని, ఇది న్యాయమూర్తుల తప్పుకాదని అన్నారు. కేసు విచారణ పదేపదే వాయిదా వేసే న్యాయవాదులతో సహా వ్యక్తులు ఉపయోగించే వ్యూహాలే కారణమన్నారు. మనీలాండరింగ్ కేసుల్లో సాక్ష్యాధారాల ప్రక్రియ వేల పేజీల్లో ఉంటుందని, వాటిని కోర్టులో నిరూపించాలని, మేజిస్ట్రేట్ ఆ ఆర్థిక లావాదేవీలను అన్వయించుకోవాలని సింగ్ అన్నారు. సుప్రీంతీర్పు తర్వాత పరిస్థితులు మెరుగవుతాయని ఆకాంక్షించారు. ఈ క్రమంలో వచ్చే మార్పు ఏ విధంగా ఉంటుందన్నది వేచిచూడాలని సింగ్ అన్నారు.

అగ్నిపథ్‌పై చర్చకు విపక్షాల పట్టు

ఈ వారం జరిగే అవకాశం

న్యూఢిల్లీ: పార్లమెంటులో అధిక ధరలపై చర్చ అనంతరం అగ్నిపథ్ పథకంపై చర్చ కోసం ప్రతిపక్షాలు పట్టుబట్టనున్నట్లు అధికార వర్గాలు ఆదివారం తెలిపాయి. సోమవారం అధిక ధరలపై లోక్‌సభలో.. మంగళవారం రాజ్యసభలో చర్చించవచ్చునని పేర్కొన్నాయి. అగ్నిపథ్‌పై చర్చకు సంబంధించి తమ మధ్య ఏకాభిప్రాయం కుదిరిందని ప్రతిపక్ష నేతలు వెల్లడించారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ఆగస్టు 12తో ముగియనున్న క్రమంలో అగ్నిపథ్‌పై చర్చించేందుకు పది రోజులు మాత్రమే ప్రతిపక్షాలకు ఉన్నాయి. 'పార్లమెంటులో కచ్చితంగా ఈ అంశాన్ని లేవనెత్తుతాంగానీ సెషన్ పూర్తి అయ్యేలోపు చర్చ కోసం బలవంతం చేసేందుకు చాలా తక్కువ సమయం ఉంది. మధ్యలో వారంతపు సెలవులు ఉన్నాయి. ఉపరాష్ట్రపతి ఎన్నిక కూడా ఉంది' అని ప్రతిపక్ష నేత ఒకరు అన్నారు. అగ్నిపథ్ పథకాన్ని రద్దు చేయాలని ఉత్తరాది నుంచి భారీ డిమాండు ఉన్నట్లు మరికొన్ని పార్టీల నేతలు అన్నారు. అగ్నివీరులకు ఉద్యోగాల కల్పన హామీకి రాష్ట్ర ప్రభుత్వం దూరంగా ఉండాలని టీఎంసీ సూచించింది. అగ్నిపథ్ పథకాన్ని రద్దు చేయాలని హరియాణాకు చెందిన కాంగ్రెస్ ఎంపీ దీపేంద్ర సింగ్ వంటి మరికొందరు నేతలు డిమాండు చేశారు. అగ్నిపథ్‌పై చర్చను డిమాండు చేస్తూ ఉభయ సభలకు నోటీసులను కాంగ్రెస్, ఆర్జేడీ, ఆర్ఎల్‌డీ అందజేసినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. మూడు నోటీసులు సోమవారం ఫైల్ కావచ్చు అని పేర్కొన్నాయి. కోర్టు పరిధిలో ఉన్న అంశం కాబట్టి అగ్నిపథ్‌పై చర్చించే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని పరోక్షంగా తమకు సమాచారం ఉన్నట్లు విపక్ష నేతలు తెలిపారు. ఇదిలావుంటే, లోక్‌సభలో కేంద్ర విశ్వవిద్యాలయాలు (సవరణ) బిల్లు-2022; వన్యప్రాణులు సంరక్షణ సవరణ బిల్లు-2021నూ ఆమోదింపజేసే యోచనలో ప్రభుత్వం ఉంది. అలాగే, రాజ్యసభలో మారణాయుధాలు, సరఫరా వ్యవస్థల (చట్టవ్యతిరేక కార్యకలాపాల నిషేధం) చట్టం, 2005; అంటార్కిటిక్ పర్యావరణ పరిరక్షణ బిల్లులను ఆమోదింపజేయాలని భావిస్తోంది. ఈ రెండు బిల్లులకు లోక్‌సభ ఆమోదం లభించడం విదితమే.

యాత్రికుల కోసం...

170 అడుగుల వంతెన నిర్మించిన ఆర్మీ

జమ్మూ : జమ్మూ కాశ్మీర్‌లోని కిష్త్వార్ జిల్లాలోని మాతా మచైల్ ఆలయాన్ని సందర్శించే యాత్రికుల సౌకర్యం కోసం భారత సైన్యం ఒక నదిపై 170 అడుగుల పొడవైన బెయిలీ వంతెనను నిర్మించినట్లు అధికారులు తెలిపారు. కరోనా మహమ్మారి కారణంగా గత రెండేళ్లగా శ్రీ మచైల్ మాత యాత్ర నిర్వహించలేదని, ఇటీవల కురిసిన వర్షాల కారణంగా తలెత్తిన వరదల్లో నదిపై ఉన్న వంతెన కొట్టుకుపోయినట్టు జిల్లా అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం అభ్యర్థన మేరకు భారత ఆర్మీకి చెందిన రెజిమెంట్ రాష్ట్రీయ రైఫిల్స్, నేషనల్ హైవేస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ సంస్థలు సంయుక్తంగా యాత్ర మార్గంలోని కుండేల్ ప్రాంతం వద్ద 170 అడుగుల పొడవైన బెయిలీ వంతెనను రికార్డు సమయంలోనే నిర్మించినట్టు పేర్కొన్నారు. సోమవారం నుంచి ఆలయ దర్శనం కోసం ప్రయాణాలు సాగించనున్న క్రమంలో యాత్రికుల సౌలభ్యం కోసం తాజాగా నిర్మించిన వంతెనను జమ్మూ డివిజనల్ కమిషనర్ రమేష్ కుమార్ కిష్త్వార్ డిప్యూటీ కమిషనర్ అశోక్ శర్మ తదితరులు ప్రారంభించినట్టు తెలిపారు. 40 రోజులు పాటు సాగే ఈ యాత్రకు ఎటువంటి అవాంతరాలు లేకుండా ముందస్తు చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. మార్గమధ్యంలో వైద్య సహాయక కేంద్రాలను, భద్రతను ఏర్పాటు చేసినట్టు వివరించారు.

మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్‌లలో ఎన్ఐఏ సోదాలు

భోపాల్: ఉగ్రవాద సంస్థ ఐసిస్ కార్యకలాపాలకు సంబంధించిన కేసులో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) ఆదివారం మధ్యప్రదేశ్‌లోని భోపాల్, రైసెన్ జిల్లాల్లో సోదాలు నిర్వహించినట్లు ఏజెన్సీ తెలిపింది. సోదాలు నేరారోపణ పత్రాలు, మెటీరియల్‌ను స్వాధీనం చేసుకున్నట్టు పేర్కొన్నారు. ఈ కేసులో తదుపరి దర్యాప్తు పురోగతిలో ఉందని ఏజెన్సీ తెలిపింది.

గుజరాత్‌లో

అహ్మదాబాద్: ఐసిస్ ఉగ్రవాద సంస్థ కార్యకలాపాలకు సంబంధించిన కేసులో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) ఆదివారం గుజరాత్‌లోని నాలుగు జిల్లాల్లో సోదాలు నిర్వహించినట్లు ఏజెన్సీ తెలిపింది. భరూచ్, సూరత్, నవ్సారి, అహ్మదాబాద్ జిల్లాల్లో సోదాలు నిర్వహించామని, నేరారోపణ పత్రాలు/మెటీరియల్ స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. ముగ్గురు వ్యక్తులను ప్రశ్నిస్తున్నట్లు గుజరాత్ ఏటీఎస్ తెలిపింది. వివరాలు ప్రస్తుతం వెల్లడించలేమని ఓ ప్రకటనలో తెలిపింది. గుజరాత్‌తో పాటు మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, మరికొన్ని రాష్ట్రాల్లో సోదాలు నిర్వహిస్తున్నట్లు ఎన్ఐఏ వివరించింది.

మహారాష్ట్రలో...

ఐసిస్ కార్యకలాపాలకు సంబంధించిన కేసులో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) ఆదివారం మహారాష్ట్రలోని నాందేడ్, కొల్హాపూర్‌లలో సోదాలు నిర్వహించిందని ఏజెన్సీ తెలిపింది. సోదాలు నేరారోపణ పత్రాలు/మెటీరియల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొంది.

కేంద్రానికి వ్యతిరేకంగా రైలుపట్టాలపై రైతుల నిరసన

చండీగఢ్: కేంద్రం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయనందుకు నిరసనగా సంయుక్త్ కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) దేశవ్యాప్త పిలుపులో భాగంగా పంజాబ్‌లో ఆదివారం అనేక చోట్ల రైతులు రైల్‌రోకో నిర్వహించారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నాలుగు గంటలపాటు సాగిన ఈ నిరసన వల్ల రాష్ట్రంలో రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. జలంధర్, ఫిలింనగర్, ఫిరోజ్‌పూర్, భటిండా సహా వివిధ ప్రాంతాల్లో రైలు పట్టాలపై ఆందోళనకారులు నిరసన తెలిపారు. ఫిలింనగర్ రైల్వే స్టేషన్‌లో జరిగిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న భారతీయ కిసాన్ యూనియన్ (కడియన్) అధ్యక్షుడు హర్మీత్ సింగ్ కడియన్ మాట్లాడుతూ, ఎస్‌కేఎం ఇచ్చిన పిలుపు మేరకు రైతులు ఈ నిరసనను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్రం తమ డిమాండ్లను పట్టించుకోకపోవడంతో రైలు పట్టాలపై నిరసన తెలపాల్సి వచ్చిందని రైతులు తెలిపారు.

గతేడాది అక్టోబరు 3న ఉత్తరప్రదేశ్ ఉపముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్య పర్యటనకు వ్యతిరేకంగా రైతులు లఖింపూర్ ఖేరీలో ఆందోళన చేస్తున్న సమయంలో చెలరేగిన హింసాత్మక ఘటనలో నలుగురు రైతులతో సహా ఎనిమిది మంది చనిపోయారు. ఈ కేసులో కేంద్ర మంత్రి అజయ్ మిశ్రా కుమారుడు ఆశిష్ మిశ్రా నిందితుడిగా ఉన్నారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి అజయ్ మిశ్రాను బర్తరఫ్ చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే గత ఏడాది వ్యవసాయ చట్టాలను వ్యతిరేకిస్తూ సాగిన ఉద్యమం సందర్భంగా రైతులపై నమోదైన కేసులను ఉపసంహరించుకోవాలని, ఆందోళనలో ప్రాణాలు కోల్పోయిన రైతుల కుటుంబాలకు పరిహారం ఇవ్వాలని, సాయుధ దళాల్లో నియామకాలకు ఉద్దేశించిన 'అగ్నిపథ్' పథకాన్ని వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. కేంద్రం ఇటీవల కనీస మద్దతు ధరపై ఏర్పాటు చేసిన కమిటీ గురించి భారతీయ కిసాన్ యూనియన్ (లఖోవాల్) ప్రధాన కార్యదర్శి హరీందర్‌సింగ్ లఖోవాల్ మాట్లాడుతూ... రద్దు చేయబడిన వ్యవసాయ చట్టాలకు అనుకూలంగా ఉన్న అధికారులు, రైతులను ప్రభుత్వం కమిటీలో చేర్చిందన్నారు.

విద్యాహక్కు చట్టం నిబంధనలు అమలు చేయాలి: ఎన్‌సీపీసీఆర్

న్యూఢిల్లీ: వెనుకబడిన/ఆర్థికంగా వెనుకబడిన వర్గాల పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో ప్రవేశం కల్పించే విద్యా హక్కు చట్టంలోని నిబంధనను అమలు చేయాలని అపెక్స్ బాలల హక్కుల సంఘం (ఎన్‌సీపీసీఆర్) కేరళ ప్రభుత్వాన్ని కోరింది. ఆర్‌టీఈ చట్టం, 2009 కింద ఇచ్చిన ఏ నిబంధనను అధికారులు అమలు చేయకపోవడం చట్టాన్ని ఉల్లంఘించడమే కాకుండా ప్రాథమిక హక్కులను కూడా ఉల్లంఘించడమేనని జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ ప్రియాంక్ కనూంగో కరళ ప్రధాన కార్యదర్శికి రాసిన లేఖలో పేర్కొన్నారు. 'ఆర్టీఈ చట్టం, 2009లోని సెక్షన్ 12 (1) (సి) ప్రకారం వెనుకబడిన/లేదా ఆర్థికంగా వెనుకబడిన వర్గాల పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో ప్రవేశం కల్పించే నిబంధన మీ రాష్ట్రంలో ఇంకా అమలు చేయబడలేదు" అని ఆయన లేఖలో పేర్కొన్నారు. దీనిపై 30రోజుల్లోగా స్పందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎన్‌సీపీసీఆర్ కోరింది.

నేటి నుంచి కేరళలో మూడు కాగితరహిత కోర్టులు

కొచ్చి: ఆగస్టు 1 నుంచి కేరళలో మూడు కాగితరహిత కోర్టులు ఏర్పాటు చేయనున్నారు. ఈ కోర్టుల్లో న్యాయవాదులకు టచ్ స్క్రీన్ పర్సనల్ కంప్యూటర్‌లు అందించబడతాయి. "కోర్టు అధికారి ప్రారంభించిన విధంగా కేసు, కేసు ఫైల్‌ల ప్రదర్శన స్వయంచాలకంగా ఉంటుంది. బోర్డులో తీసుకున్న కేసు ఫైల్‌ను చూడటానికి న్యాయవాది లాగిన్ చేయవలసిన అవసరం లేదు. అతను కేసు ఫైల్‌ను వీక్షించడానికి, ప్రాతినిధ్యం వహించడానికి మాత్రమే తెరవాలి' అని కేరళ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ ఓ నోటీసులో పేర్కొన్నారు. అంతేకాకుండా, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ న్యాయవాదులకు, అలాగే నియమించబడిన న్యాయవాదిని కలిగి ఉన్న ఇతర సంస్థలకు అందించాల్సిన కాపీలను ఇ-ఫైలింగ్ సమయంలో ఆన్‌లైన్ డ్యాష్‌బోర్డ్ ద్వారా కొనసాగించవచ్చని నోటీసులో తెలిపింది. వ్యతిరేక పక్షానికి నియమించబడిన న్యాయవాది లేని పక్షంలో, కేసు యొక్క హార్డ్ కాపీలు సమర్పించాల్సి ఉంటుందని వివరించింది. "కాగిత రహిత న్యాయస్థానాల ముందు దాఖలు చేయడానికి ప్రతిపాదించబడిన కేసులలో, పరిశీలన తర్వాత ఇ-ఫైల్ చేసిన కేసు యొక్క భౌతిక కాపీలను ఫైల్ చేయవలసిన అవసరం లేదు. కేసులు లోపభూయిష్టంగా ఉన్న తర్వాత, అది స్టాండింగ్ సూచనల ప్రకారం స్వయంచాలకంగా జాబితా చేయబడుతుంది' అని నోటీసులో ఉంది. కాగిత రహిత న్యాయస్థానాల మొదటి దశను ఒక డివిజన్ బెంచ్, రెండు సింగిల్ బెంచ్‌లలో ప్రవేశపెట్టడం లేదా అమలు చేయడం జరుగుతోందని, ఇది ప్రధానంగా బెయిల్, పన్ను విషయాలకే పరిమితం అవుతుందని జులై 21న హైకోర్టు నోటీసు జారీ చేసింది.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

విద్యార్థినిని చెప్పుతో కొట్టడంపై అధికారుల ఆగ్రహం

రత్లాం(మధ్యప్రదేశ్): ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడు విద్యార్థినిని పదే పదే చెప్పుతో కొట్టిన వీడియో సోషల్ మీడియాలో వైరలైంది. ఈ ఘటన మధ్యప్రదేశ్‌లోని రత్లాం జిల్లాలో చోటుచేసుకుంది. దీంతో ఆ ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేసినట్టు ఆదివారం అధికారులు తెలిపారు. మమత్‌ఖేడాలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో జరిగిన సంఘటనకు సంబంధించిన వీడియో శనివారం సోషల్ మీడియాలో ప్రసారం కావడంతో ఉపాధ్యాయుడు జేకే మొగరాపై కూడా విచారణ ప్రారంభించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈవో) కేసీ శర్మ తెలిపారు. ప్రాథమిక పాఠశాలలో 1 నుంచి 5 తరగతులకు బాలికలు హాజరుకావడం లేదని, ఉపాధ్యాయుడు చెంపదెబ్బ కొట్టాడని అధికారులకు ఫిర్యాదు అందింది. ఈ మేరకు ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేసి విచారణ చేపట్టారు. బాధితురాలు విలేకరులతో మాట్లాడుతూ.. టీచర్ చెంపదెబ్బ కొడతారనే భయంతో చాలా మంది బాలికలు పాఠశాలకు రావడం లేదని, ఇది నిత్యకృత్యమేనని పేర్కొంది.

20 వేల దిగువకు కొత్త కేసులు

న్యూఢిల్లీ: దేశంలో కరోనా వ్యాప్తి కొనసాగుతోంది. కొత్త కేసులు 20 వేల దిగువన నమోదయ్యాయి. ఇక క్రియాశీల కేసులు 1.4 లక్షలపైనే కొనసాగుతున్నాయి. కేంద్ర ఆరోగ్య శాఖ వెల్లడించిన గణాంకాల ప్రకారం.. గడిచిన 24 గంటల్లో 3,96,424 నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా.. కొత్తగా 19,673 కేసులు వెలుగులోకి వచ్చాయి. దీంతో దేశంలో క్రియాశీల కేసుల సంఖ్య 1,43,676(0.33%)కు చేరింది. వైరస్ నుంచి కోలుకున్న వారి సంఖ్య 4.33 కోట్లు (98.48%) దాటింది. శనివారం 39 మంది కరోనాతో మృతి చెందగా.. ఇప్పటి వరకూ ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య 5,26,357కు చేరింది. శనివారం 31,36,029 మందికి టీకాలు వేయగా.. ఇప్పటి వరకూ పంపిణీ చేసిన డోసుల సంఖ్య 204.25 కోట్లు దాటింది.

గోవాలో ఘరానా నేరస్తుడి అరెస్టు

పనాజీ : నాలుగేళ్లుగా పోలీసుల కంటపడకుండా తప్పించుకు తిరుగుతున్న ఘరానా నేరస్తుడిని ముంబై పోలీసులు గోవాలో అరెస్టు చేశారు. హత్య, దోపిడీ సహా 30కి పైగా కేసుల్లో నిందితుడైన విక్రాంత్ దేశ్‌ముఖ్ గోవాలో ఉన్నట్టు తెలుసుకున్న ముంబై పోలీసులు స్థానిక పోలీసుల సహకారంతో పనాజీలో క్యాసినో షిప్ ఎక్కుతుండగా మాటు వేసి పట్టుకున్నట్టు నార్త్ గోవా ఎస్పీ శోభిత్ సక్సేనా తెలిపారు. నిందితుడిపై 33 కేసులు ఉన్నాయని పేర్కొన్నారు. నాలుగేళ్లుగా పోలీసుల కంటపడకుండా తిరుగుతున్న నిందితుడు రెండు రోజుల కిందట విహారం కోసం గోవా వచ్చినట్టు తెలిపారు. షిప్ ఎక్కుతున్న నిందితుడిని పట్టుకునే తరుణంలో పారిపోయే ప్రయత్నం చేయడంతో పోలీసులు వెంబడించి అరెస్టు చేసినట్టు పేర్కొన్నారు. నిందితుడి వద్ద తుపాకి సహా ఐదు బుల్లెట్లును కూడా స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

అన్యాయంగా వ్యక్తి అరెస్టు...

రూ.5 లక్షల పరిహారం చెల్లింపు

బెంగళూరు: ఓ క్రిమినల్ కేసులో తన పేరుపై గందరగోళం నెలకొనడంతో 56 ఏళ్ల వ్యక్తికి కోర్టును ఆశ్రయించగా, ఆయనకు రూ.5 లక్షల పరిహారం చెల్లించిన ఘటన బెంగళూరులో చోటుచేసుకుంది. కాళిదాసు లేఅవుట్‌కు చెందిన నింగరాజు ఎన్ అనే వ్యక్తి 2011లో దాఖలు చేసిన క్రిమినల్ కేసులో నిందితుడు రాజు ఎన్‌జీఎన్ తాను కాదని హైకోర్టును ఆశ్రయించారు. అతనిపై కేసును కొట్టివేస్తూ, 'ఒక వ్యక్తిని అరెస్టు చేయాల్సిన వ్యక్తి అతనేనని మరియు అతనిపై వారెంట్ జారీ చేయబడిందని నిర్ధారించకుండా అరెస్టు చేయడం చాలా దిగ్భ్రాంతికరం" అని హైకోర్టు పేర్కొంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం జీవించే హక్కు, స్వేచ్ఛ అత్యంత ముఖ్యమైనదని, ఈ కేసులో ప్రాథమిక హక్కు ఉల్లంఘన జరిగిందని హైకోర్టు పేర్కొంది. ఇందుకు పరిహారంగా రూ.5 లక్షలు చెల్లించాలని, ఎనిమిది వారాల్లో ఈ వ్యవహారం పరిష్కరించాలని కోర్టు ఆదేశించింది. వారెంట్‌లో పేర్కొన్న వ్యక్తి పేరుతో పాటు అతని తండ్రి (నింగేగౌడ) పేరు కూడా ఉన్నందున నింగరాజును అరెస్టు చేశారు.

ఢిల్లీ పోలీస్ కమిషనర్‌గా సంజయ్ అరోరా

న్యూఢిల్లీ : దేశ రాజధాని న్యూఢిల్లీ నూతన పోలీసు కమిషనర్‌గా తమిళనాడు కేడర్‌కు చెందిన ఐపీఎస్ అధికారి సంజయ్ అరోరా నియమితులయ్యారు. ప్రస్తుతం ఢిల్లీ కమిషనర్‌గా పని చేస్తున్న రాకేశ్ ఆస్థానా ఆదివారం పదవీ విరమణ చేయడంతో అరోరాను ఆ స్థానంలో నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. పారామిలటరీకి చెందిన ఐటీబీపీకి నేతృత్వం వహించిన అరోరా తమిళనాడులో గంధపు చెక్కల స్మగ్లర్ వీరప్పన్‌ను పట్టుకోవడంలో కీలకపాత్ర వహించారు. రాష్ట్ర స్పెషల్ టాస్క్‌ఫోర్స్‌లో సంజయ్ అరోరా పని చేశారు. 1988 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన అరోరా సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఆయన 2025 వరకూ ఆ పదవిలో కొనసాగే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

ఈడీ అదుపులో సంజయ్ రౌత్

- తొలుత ఆయన నివాసంలో సోదాలు
- గంటల తరబడి విచారణ
- 'సేనను వీడేది లేదంటూ ఎంపీ ట్వీట్

ముంబై: శివసేన ఎంపీ సంజయ్ రౌత్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అదుపులోకి తీసుకుంది. రూ.వెయ్యి కోట్లకు పైగా భూ కుంభకోణానికి పాల్పడినట్లు రౌత్ ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఆదివారం ఉదయం నుంచి సంజయ్ రౌత్‌ను ఈడీ కొన్ని గంటలపాటు విచారణ చేసింది. సాయంత్రం అదుపులోకి తీసుకుంది. సంజయ్ రౌత్ అరెస్ట్ వార్తలు కలకలం రేపడంతో శివసేన కార్యకర్తలు పెద్ద ఎత్తున ఆయన ఇంటి వద్దకు చేరుకున్నారు. ఆయనకు మద్దతుగా, బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా తన ఇంటిలో నుంచి కార్యకర్తలకు రౌత్ అభివాదం చేశారు. తొలుత ఆదివారం ఉదయం మనీలాం డరింగ్ కేసుకు సంబంధించి సంజయ్ రౌత్ నివాసంలో ఈడీ సోదాలు నిర్వహించినట్లు ఒక అధికారి తెలిపారు. అయితే ముంబై 'చాల్' రీ-డెవలప్‌మెంట్‌లో అవకతవకలు, సంజయ్ రౌత్ భార్య, అతని సహచరులకు సంబంధిత లావా దేవీలకు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో రౌత్‌ను ఈడీ విచారణకు పిలిచింది. ఇప్పటికే ఈ కేసుకు సంబంధించి ఏప్రిల్ నెలలో సంజయ్ రౌత్ భార్య వర్షా రౌత్, మరో ఇద్దరికి చెందిన రూ.11.15 కోట్ల విలువైన ఆస్తులను ఈడీ అటాచ్ చేసింది. జులై 1న రాజ్యసభ ఎంపీని సుమారు 10 గంటల పాటు ప్రశ్నించగా... మనీలాండరింగ్ నిరోధక చట్టంలోని క్రిమినల్ సెక్షన్ల కింద ఆయన వాంగ్మూలాన్ని నమోదు చేశారు. అయితే మనీలాండరింగ్ కేసులో ప్రశ్నించేందుకు రౌత్ రెండు సార్లు ఈడీ సమన్లను దాటవేశారు. ఇందులో తాజాగా జులై 27న జారీ చేసిన సమన్లు కూడా ఉన్నాయి. పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో విచారణకు హాజరుకాలేదని రౌత్ చెబుతున్నారు. ఆదివారం ఉదయం 7 గంటలకు ముంబై శివారు భాండూప్‌లో ఉన్న రౌత్ నివాసం 'మైత్రి' బంగ్లాకు చేరుకున్న ఈడీ బృందం కేంద్ర సాయుధ పోలీసు బలగాలు (సీఆర్‌పీఎఫ్) తో కలిసి సోదాలు నిర్వహించడంతో పాటు ఆయనను ప్రశ్నించింది. గంటల తరబడి విచారణ అనంతరం సంజయ్ రౌత్‌ని అదుపులోకి తీసుకుంది. ఇదిలాఉండగా, శివసేనకు చెందిన ఉద్ధవ్ ఠాక్రే శిబిరంలో ఉన్న రాజ్యసభ సభ్యుడు... తాను ఎటువంటి తప్పు చేయలేదని తెలిపారు. రాజకీయ ప్రతీకారం కారణంగా తనను లక్ష్యంగా చేసుకున్నారని ఆరోపించారు. 'నాకు ఎలాంటి కుంభకోణంతో సంబంధం లేదని దివంగత బాలాసాహెబ్ థాకరే చేత ప్రమాణం చేస్తున్నాను. బాలాసాహెబ్ మనకు పోరాడడం నేర్పించారు. నేను శివసేన కోసం పోరాడుతూనే ఉంటాను. నేను చనిపోతాను కానీ శివసేనను వీడను' అని స్పష్టం చేస్తూ ఈడీ చర్య ప్రారంభమైన కొద్దిసేపటికే రౌత్ ట్వీట్ చేశారు. ఈడీ సోదాల సమయంలో పెద్ద సంఖ్యలో శివసేన మద్దతుదారులు రౌత్ నివాసం వెలుపల గుమిగూడారు. దర్యాప్తు సంస్థ చర్యకు వ్యతిరేకంగా నిరసనలు చేపట్టారు. కాషాయ జెండాలు, బ్యానర్లు చేతిలో పట్టుకుని సేన ఎంపీ మద్దతుదారులు ఈడీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రౌత్ తన ఇంటి కిటికీలోంచి తన మద్దతుదారులకు అభివాదం చేశారు. దక్షిణ ముంబైలోని బల్లార్డ్ ఎస్టేట్ ప్రాంతంలో ఉన్న ఈడీ కార్యాలయం వద్ద భారీ సంఖ్యలో పోలీసులను మోహరించినట్లు ఒక అధికారి తెలిపారు. కార్యాలయానికి వెళ్లే రహదారులపై వాహనాల రాకపోకలను మూసివేసి బారికేడ్లు ఏర్పాటు చేశామని అన్నారు.

సామూహిక ఉద్యమంగా అమృత్ మహోత్సవ్

- సోషల్ మీడియా అకౌంట్ల డీపీగా త్రివర్ణ పతాకం
- 'మన్‌కీ బాత్'లో ప్రధాని నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ: 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్' కార్యక్రమం ఒక సామూహిక ఉద్యమంగా మారుతోందని, అందుకు చాలా సంతోషంగా ఉందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. మన్‌కీ బాత్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆగస్టు 2 నుంచి 15 వరకు ప్రజలందరూ తమ సామాజిక మాధ్యమ ఖాతాల ప్రొఫైల్ పిక్‌గా జాతీయ జెండా ఫొటోను పెట్టుకోవాలని మోదీ కోరారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన షహీద్ ఉధమ్ సింగ్‌కు ఆయన నివాళులర్పించారు.

"ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా ఆగస్టు 13 నుంచి 15 వరకు 'హర్ ఘర్ తిరంగా' పేరుతో ప్రత్యేక ఉద్యమం నిర్వహిస్తున్నాం. ఆ మూడు రోజులు... ప్రతి ఇంటి వద్ద జాతీయ జెండా ఎగురవేసి దేశభక్తిని చాటుకోండి. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు పూర్తవుతున్న తరుణంలో మనమందరం ఒక అద్భుతమైన, చరిత్రాత్మక ఘట్టాన్ని చూడబోతున్నాం. దేశవ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలు ఈ ఉత్సవాల్లో ఏదో రూపంలో పాల్గొంటున్నారు" అని మోదీ పేర్కొన్నారు. ఆటబొమ్మల ఎగుమతిలో భారత్ పవర్‌హౌస్‌గా మారుతోందని మోదీ అన్నారు. బొమ్మల ఎగుమతి రూ.300-400 కోట్ల నుంచి రూ.2,600 కోట్లకు చేరిందని పేర్కొన్నారు. 'భారతీయ పురాణాలు, చరిత్ర, సంస్కృతి ఆధారంగా తయారీదారులు ఇప్పుడు ఆట బొమ్మలను తయారు చేస్తున్నారు. వాటి నుంచి మంచి ఆర్థిక ప్రయోజనాలు పొందు తున్నారు. అవే ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా అమ్ముడవుతున్నాయి' అని మోదీ తెలిపారు. మువ్వన్నెల జెండా రూపకర్త పింగళి వెంకయ్య జయంతి ఆగస్టు 2నే అని ప్రధాని గుర్తుచేశారు. త్రివర్ణ పతాక రూపకల్పనలో మేడం కామా కూడా కీలక పాత్ర పోషించినట్లు ఆయన స్మరించుకున్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా కర్ణాటకలో 'అమృత భారతి కన్నడర్తి' పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించినట్లు మోదీ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 75 ప్రదేశాల్లో.. ఆయా ప్రాంతాలకు చెందిన స్వాతంత్ర్య సమరయోధుల్ని స్మరించుకుంటూ ప్రత్యేక కార్యక్రమాల్ని నిర్వహించినట్లు వెల్లడించారు. స్వాతంత్ర్య పోరాటంలో రైల్వేల ప్రాముఖ్యతను వివరిస్తూ 'ఆజాదీ కా రైల్‌గాడీ' పేరుతో ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా 75 రైల్వే స్టేషన్లను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దినట్లు పేర్కొన్నారు.

6 నుంచి సీపీఐ తమిళనాడు రాష్ట్ర మహాసభలు

హాజరు కానున్న సీఎం, మిత్రపక్షాల నేతలు

కోయంబత్తూరు: భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) తమిళనాడు రాష్ట్ర 24వ మహాసభలకు చురుకుగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆగస్టు 6 నుంచి నాలుగు రోజుల పాటు తిరుపూర్‌లో ఈ మహాసభలు జరగనున్నాయి. పార్టీ సీనియర్ నేత ఆర్ నల్లకన్ను, ఎంపీ కె.సుబ్బరాయన్ అధ్వర్యంలో విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నారు. సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా ముఖ్య అతిథిగా హాజరయ్యే ఈ మహాసభలకు తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, టీఎన్‌సీసీ అధ్యక్షుడు కేఎస్ అళగిరి, ద్రవిడ కజకం నేత కె.వీరమణి, ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైకో, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కె.బాలకృష్ణన్, వీసీకే అధ్యక్షుడు తిరుమవలవన్, ఐయూఎంఎల్ జాతీయ అధ్యక్షుడు కేఎం ఖాదర్ మొయిద్దీన్, కేఎండీకే ప్రధాన కార్యదర్శి ఈఆర్ ఈశ్వరన్, టీఎంఎంకే నేత ఎంహెచ్ జవాహిరుల్లా హాజరై సందేశాలిస్తారని పార్టీ రాష్ట్రశాఖ కార్యదర్శి ఆర్ ముతరాసన్ తెలిపారు. మహాసభల ప్రారంభానికి ముందు చిన్నియంపాలయంలోని స్వాతంత్ర్య సమరుల వేదిక నుంచి మహాసభల వేదిక వరకు జ్యోతిని తీసుకు వస్తారు. 75వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలోని పార్టీ కార్యాలయాలపై త్రివర్ణ పతాకాలు ఎగురవేయాలని సీపీఐ నిర్ణయించింది. 'దేశాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించాలి' అని నినాదమిచ్చింది.

దాయాదిపై చిరకాల విజయం

- అర్ధసెంచరీతో రాణించిన స్మృతి మంధన
- 3న బార్బడోస్‌తో తలపడనున్న టీమిండియా

బర్మింగ్‌హామ్: కామన్వెల్త్‌లో భారత క్రికెట్ అమ్మాయిలు తొలి గెలుపు రుచి చూశారు. కీలకమైన పోరులో పాకిస్తాన్‌పై టీమిండియా ఎనిమిది వికెట్ల తేడాతో ఘన విజయం నమోదు చేసింది. తొలుత 99 పరుగులకే పాక్‌ను కట్టడి చేసిన భారత్.. లక్ష్య ఛేదనలో ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా ధాటిగా ఆడేసింది. కేవలం రెండు వికెట్లను మాత్రమే నష్టపోయి 11.4 ఓవర్లలో 102 పరుగులు చేసి విజయం సాధించింది. ఓపెనర్ స్మృతీ మంధాన (63 నాటౌట్) హాఫ్ సెంచరీ సాధించి కీలక పాత్ర పోషించింది. షఫాలీ వర్మ 16, సబ్బినేని మేఘన 14, రోడ్రిగ్స్ 2లి పరుగులు చేశారు. పాక్ బౌలర్లలో టుబా హస్సన్, సోహైల్ చెరో వికెట్ తీశారు.

బౌలింగ్‌లో అదరగొట్టి..

బౌలింగ్‌లోనూ పాక్‌ను టీమిండియా బెంబేలెత్తించింది. తొలి ఓవర్‌నే రేణుకా సింగ్ మెయిడిన్ వేయగా.. రెండో ఓవర్‌లో పాక్ బ్యాటర్ జావెద్ (0)ను మేఘ్నా సింగ్ పెవిలియన్‌కు చేర్చింది. అయితే ఆ తర్వాత క్రీజ్‌లోకి వచ్చిన కెప్టెన్ మరూఫ్ (17)తో కలిసి ఓపెనర్ మునీబా అలీ (32) ఇన్నింగ్స్‌ను నిర్మించేందుకు ప్రయత్నించింది. వీరిద్దరూ కలిసి రెండో వికెట్‌కు 50 పరుగులను జోడించారు. ప్రమాదకరంగా మారిన ఈ జోడీని స్నేహ్ రాణా ఒకే ఓవర్‌లో ఔట్ చేసి భారత్‌కు బ్రేక్ ఇచ్చింది. దీంతో అప్పటి నుంచి పాక్ పతనం ప్రారంభమైంది. అయేషా నసీమ్ (10), అలియా రియాజ్ (18), సోహైల్ (10) రెండంకెల స్కోరు సాధించడంతో పాక్ ఈ మాత్రం స్కోరునైనా నమోదు చేసింది. ఆఖరి ఓవర్‌లో రనౌట్ సహా రెండు వికెట్లను తీసి పాక కుప్పకూలడంలో రాధా యాదవ్ కీలకపాత్ర పోషించింది. దీంతో సరిగ్గా 18 ఓవర్లకు 99 పరుగులకు పాక్ ఆలౌటైంది. భారత బౌలర్లలో స్నేహ్ రాణా 2, రాధా యాదవ్ 2.. షఫాలీ వర్మ, రేణుకా సింగ్, మేఘ్నా సింగ్ తలో వికెట్ తీశారు.

ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా..

పాకిస్తాన్ నిర్దేశించిన 100 పరుగుల లక్ష్య ఛేదనను భారత్ ధాటిగా ప్రారంభించింది. తొలి ఓవర్‌ను ఆచితూచి ఆడిన ఓపెనర్లు స్మృతీ మంధాన, షఫాలీ వర్మ ఆ తర్వాతి నుంచి చెలరేగారు. కేవలం ఆరు ఓవర్లలోనే తొలి వికెట్‌కు 61 పరుగులు జోడించారు. దూకుడు పెంచేందుకు యత్నించిన షఫాలీని టుబా హస్సన్ పెవిలియన్‌కు చేర్చింది. ఆ తర్వాత వచ్చిన సబ్బినేని మేఘన (14)తో మంధాన ఇన్నింగ్స్‌ను ముందుకు తీసుకెళ్లింది. మరో ఆరు పరుగులు చేస్తే విజయం భారత్ సొంతమవుతుందనే క్రమంలో పాక్ బౌలర్ సొహైల్ బౌలింగ్‌లో మేఘన క్లీన్‌బౌల్డయింది. ఆఖర్లో స్మృతీ మంధాన ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా బౌండరీతో భారత్‌ను విజయతీరాలకు చేర్చింది. దీంతో కామన్వెల్త్ గేమ్స్‌లో టీమిండియా సెమీస్ ఆశలు సజీవంగా నిలిచాయి. బుధవారం బార్బోడస్‌తో జరిగే మ్యాచ్‌లో విజయం సాధిస్తే భారత్ సెమీస్‌కు చేరుకునే అవకాశం ఉంది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.